ప్రజాశక్తి

శుక్రవారం 25 జూలై 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

హైడ్రో పవర్ ప్రాజెక్టులను

రద్దు చేయాల్సిందే..

- రేగులపాలెం, చింతలపూడి బహిరంగ సభల్లో ఏకగ్రీవ తీర్మానం
- ఆదివాసీల, ప్రజల జీవితాలను ఛిద్రం చేస్తారా ?
- ప్రభుత్వంపై సిపిఎం నాయకులు వి.శ్రీనివాసరావు, కె.లోకనాథం ధ్వజం

విల్లంభులు ఎక్కుపెట్టి నిరసన తెలుపుతున్న వి.శ్రీనివాసరావు, లోకనాథం తదితరులు

ప్రజాశక్తి - అనంతగిరి, దేవరాపల్లి విలేకరులు

ఆదివాసీల, ప్రజల జీవితాలను ఛిద్రం చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ అల్లూరి జిల్లా అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ రేగులపాలెం, అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం చింతలపూడి ప్రాంతాల్లో సిపిఎం ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన బహిరంగ సభలకు ప్రజలు భారీగా తరలివచ్చారు. తమ బతుకులను ధ్వంసం చేసే ప్రాజెక్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ప్రభుత్వం తమ మాటను కాదని ముందుకెళ్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ రేగులపాలెంలో సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు అధ్యక్షతన, చింతలపూడిలో సిపిఎం జిల్లా మిగతా 2లో..

చింతలపూడి సభలో అభివాదం చేస్తున్న నాయకులు

ప్రభుత్వ భూ దాహానికి కేంద్రంగా విశాఖ

- సత్వ డెవలపర్స్‌కు ఐటి హిల్ నెంబర్ 4పై 30 ఎకరాలు
- రుషికొండ, మధురవాడ భూములన్నీ హాంఫట్ ?
- 2007 నాటి ల్యాండ్ పూలింగ్ కొనసాగింపునకు మంత్రి మండలి ఆమోదం
- విశాఖ మెడ్‌టెక్ జోన్ వద్ద 5 స్టార్ హోటల్ అభివృద్ధికి నిర్ణయం
- విశాఖ మెట్రో పనులకు టెండర్ల ఆహ్వానం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలోని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖలో భూ పందేరానికి తెరతీసింది. పెద్ద ఎత్తున పలు సంస్థలకు భూముల కేటాయింపులకు ఆమోదం తెలుపుతూ గురువారం అమరావతిలో జరిగిన రాష్ట్ర కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా అనకాపల్లి గ్రామీణ ప్రాంతాల్లో గతంలో చేపట్టిన ల్యాండ్ పూలింగ్‌ను కొనసాగించేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. విశాఖ మెట్రోరైల్ ప్రాజెక్టుకు ఈ మంత్రి మండలిలో కాసింత కదలిక వచ్చింది. మొత్తం అంచనా వ్యయం రూ.11,498 కోట్లలో 40 శాతం (తొలిదశ) పనులకుగానూ 50-50 జాయింట్ వెంచర్ ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టెండర్‌లను త్వరలో ఆహ్వానించేందుకుగానూ మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ 'మెరుగైన ఐటి పాలసీతో ప్రఖ్యాత ఐటి పరిశ్రమలను ఎపికి రప్పిస్తామని, విశాఖ మహానగరాన్ని 100 బిలియన్ ఎకానమీగా అభివృద్ధి చేస్తామని' వెల్లడించారు.

రుషికొండ ఐటి సెజ్ వ్యూ (ఫైల్ ఫొటో)

ఎక్కడెక్కడ భూములకు ఆమోదం లభించిందంటే...

రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సిఫారసు మేరకు విశాఖ జిల్లా మధురవాడ ఐటి హిల్ నెంబర్ 3పై 3.6 ఎకరాల భూమిని ఎకరా రూ.కోటి చొప్పున, పరదేశిపాలెం వద్ద 50 ఎకరాలను ఎకరా రూ.50 లక్షలు చొప్పున మెస్సెర్స్ సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్‌కు ఎపిఐఐసి ద్వారా కేటాయించి తద్వారా మిగతా 2లో..

భద్రయ్యపేటకు నేతలు, అధికారుల తాకిడి

▶ వార్త 3లో..

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

▶ వార్త 5లో..

పిఎఫ్ బకాయిలు చెల్లించాలని ధర్నా

▶ వార్త 4లో..

పల్లా భవనం కూల్చిన అధికారులపై చర్యలు

- టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత సహా ఇద్దరికి షోకాజ్ నోటీసులు
- నాటి డిసిపి నరేందర్ రెడ్డి, టిపిఒ, టిపిఎస్‌ల సస్పెన్షన్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నిర్మిస్తున్న కమర్షియల్ కాంప్లెక్స్‌ను గత వైసిపి ప్రభుత్వ కాలంలో నిబంధనలకు విరుద్ధంగా కూల్చేసారన్న కారణంతో నాటి అధికారులు కొంతమంది గురువారం సస్పెన్షన్‌కు గురయ్యారు. అప్పట్లో జివిఎంసి చీఫ్ ప్లానింగ్ అధికారి, ప్రస్తుతం ఎపి టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న ఆర్‌జె విద్యుల్లతకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీచేసింది. ఏడు రోజుల్లో సమాధానం చెప్పాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. ఒకవేళ ఈ సమయంలో ఆమె నుంచి ఎలాంటి సమాధానం రానియెడల తదుపరి చర్యలకు ప్రభుత్వం వెళ్తుందని నోటీసులో పేర్కొన్నారు. అదే విధంగా అప్పటి డిసిపి టి.నరేంద్రరెడ్డి, జోన్-6 టిపిఒ ఎస్.వినయ్ ప్రసాద్, జోన్ - 6 టిపిఎస్‌గా పనిచేసిన ఎస్.వరప్రసాద్‌లపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. అలాగే అప్పటి సిటీ ప్లానర్, ప్రస్తుతం జివిఎంసి సిసిపి ప్రభాకర్. అప్పటి జోనల్ కమిషనర్ దువ్వాడ శ్రీధర్‌లకు కూడా షోకాజ్ నోటీసులను జారీచేసింది.

పల్లా శ్రీనివాసరావు ఏమన్నారంటే..

గురువారం విశాఖలో మీడియాతో పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను వెయ్యి గజాల స్థలంలో జివిఎంసి పర్మిషన్ తీసుకుని గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్, సెకండర్ ఫ్లోర్‌లను నిర్మించానన్నారు. వైసిపి ప్రభుత్వంలోనే అన్ని అనుమతులూ నాడు తెచ్చుకున్నానన్నారు. మరో రెండు ఫ్లోర్‌లను నిర్మించాల్సి ఉండగా జివిఎంసి అధికారులు ఎలాంటి ముందస్తు నోటీసులూ ఇవ్వకుండా తమ నిర్మాణాన్ని ధ్వంసం చేశారని తెలిపారు.

అప్పట్లో రాజకీయ నాయకుల చెప్పుచేతల్లో ఉండి నిబందనలను ఉల్లంఘించిన వారిని ఇప్పుడు శిక్షించడం జరుగుతోందన్నారు. రాజకీయ నాయకుల ఆదేశాలతో కాకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధికారులు ఎవరైనా నడుచుకోవాలన్నారు

మలేరియా, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ◆ ప్రకాశరావుపేట వీధుల్లో పర్యటన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని జివిఎంసి అధికారులను, వైద్య సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. పారిశుధ్య చర్యలు పక్కాగా చేపట్టాలని, డ్రెయిన్లను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా మలేరియా వ్యాప్తి చెందకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని చెప్పారు. గురువారం స్థానిక ప్రకాశరావుపేట వీధుల్లో జివిఎంసి ప్రధాన మెడికల్ అధికారి నరేశ్ కుమార్, ఇతర అధికారులు, వైద్య సిబ్బందితో కలిసి పర్యటించిన జిల్లా కలెక్టర్ అక్కడ పరిస్థితులను గమనించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్ప్రేయింగ్, ప్రాథమిక వైద్య సేవలు, పారిశుధ్య చర్యలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. క్రమం తప్పకుండా అన్ని రకాల చర్యలు చేపడుతున్నారా లేదా అనే అంశాలను ఆరా తీశారు. తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని, పరిస్థితులను బేరీజు వేసుకొని తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. మలేరియా వ్యాప్తి కారకాలపై ప్రధాన దృష్టి సారించాలని, ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రకాశరావుపేట వీధుల్లో పర్యటిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

జివిఎంసి ప్రాథమికోన్నత పాఠశాల సందర్శన

ప్రకాశరావుపేటలోని జివిఎంసి ప్రాథమికోన్నత పాఠశాలను డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్‌తో కలిసి కలెక్టర్ సందర్శించారు. అక్కడ పరిస్థితులను గమనించారు. విద్యార్థులకు అందుతున్న బోధన తీరును పరిశీలించారు. రెండో తరగతి, పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించిన ఆయన లెర్నింగ్ అవుట్ కమ్స్‌పై ఆరా తీశారు. ఈ క్రమంలో రెండో తరగతి విద్యార్థిని చేత ప్రాథమిక సంఖ్యలను బోర్డుపై రాసి చదివించారు.

అల్లిపురం అర్బన్ పిహెచ్‌సి సందర్శన, రికార్డుల తనిఖీ

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కలెక్టర్ అల్లిపురం పరిధి భీమ్ నగర్‌లో ఉన్న అర్బన్ పిహెచ్‌సిని సందర్శించారు. మందులు, సిబ్బంది విధులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. అక్కడకు వచ్చిన రోగులతో మాట్లాడి స్థానిక ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం సమీపంలోని పితానిదిబ్బ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు.

మొదటి పేజీ తరువాయి..

హైడ్రో పవర్ ప్రాజెక్టులను రద్దు చేయాల్సిందే..

హైడ్రో పవర్ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ చింతలపూడి సభలో నినదిస్తున్న ప్రజలు

కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న అధ్యక్షతన బహిరంగ సభలు జరిగాయి. ఆయా చోట్ల సిపిఎం నేతలకు గ్రామస్తులు ఎక్కడికక్కడ పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. బహిరంగ సభల్లో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టుల వల్ల ఆదివాసీ ప్రాంతాలు, పర్యావరణం దెబ్బతింటాయన్నారు. ప్రజల జీవనోపాధికి విఘాతం కలుగుతుందని తెలిపారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులకు అనుమతులిస్తూ జారీ చేసిన జిఒ 51ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండిగా వ్యవహరిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు ప్రధాని మోడీ పవన్ కల్యాణ్ చేతిలో చాక్లెట్ పెడితే.. ప్రజల భూములను ఆయన కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు చూస్తున్నారన్నారు. అదానీ ఎక్కడ అడుగుపెట్టినా ఆ ప్రాంతమంతా భస్మీపటలమేనన్నారు. అనంతగిరి మండలంలోని పాఠశాలలకు భవనాలు కరువయ్యాయన్నారు. అక్కడ రేకులషెడ్లలోనే బోధన సాగుతోందని తెలిపారు. పాఠశాలల భవనాలు కట్టడంపై ప్రభుత్వం శ్రద్ధ వహించకుండా అదానీకి హైడ్రో పవర్ ప్రాజెక్టుల కోసం భూములు అప్పగించడానికి మాత్రం ఉరకలు వేస్తోందన్నారు. కొండలు, పచ్చని పంటలతో ఉన్న ప్రాంతాలన్నీ అదానీ చేతిలో పడితే మాడిమసైపోతాయన్నారు. ప్రజలంతా ఐక్యంగా ఉండి హక్కులను, భూములను కాపాడుకోవాలన్నారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతుంటే, ఆ విషయాన్ని పక్కనపెట్టి అదానీకి భూములు కట్టబెట్టడానికి ప్రభుత్వం చూస్తోందని తెలిపారు. ఎన్నికలకు ముందు నాయకులు ప్రజలకు మాయమాటలు చెప్పి, గద్దెనెక్కిన తర్వాత ప్రజల నడ్డి విరుస్తున్నారని అన్నారు. గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా హైడ్రో పవర్ ప్రాజెక్టులకు ఎలా అనుమతులిస్తారని ప్రశ్నించారు. పెదకోట, మారిక, చింతలపూడి గిరిజనులను ప్రభుత్వం మోసం చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అదానీ స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజలపై విద్యుత్ భారాలు మోపేందుకు ప్రభుత్వం చూస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఆయా చోట్ల జరిగిన బహిరంగ సభల్లో సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బిసిహెచ్.పడాల్, పోతురాజు, వి.ఉమామహేశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, సిపిఎం అనంతగిరి మండల కార్యదర్శి మొస్య, నాయకులు సోమెల నాగులు, పెదకోట ఎంపిటిసి శిరగం శ్రావణి, సర్పంచ్ శిరగం అన్నపూర్ణ, అనంతగిరి మహిళా సంఘం నాయకులు దీసరి దేముడమ్మ, పీసా కమిటీ సభ్యులు నారంగి సింహాచలం, గొల్లోరి ఆనంద్, బంగారు నాయుడు, సప్పి దేముడు, సోమెల దేముడు, దేవయ్య, సిపిఎం దేవరాపల్లి మండల కార్యదర్శి బిటి.దొర, సర్పంచులు, దమ్మంగి బోడెమ్మ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూ దాహానికి కేంద్రంగా విశాఖ

రూ.16,466 కోట్ల పెట్టుబడులను 600 ఉద్యోగాలను కల్పించేందుకు కృషిచేస్తామని రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ వ్యూహాత్మక అభివృద్ధితో విశాఖ కీలక డేటా హబ్‌గా అవతరించి టెక్నాలజీ ఆధారిత సంస్థలను ఆకర్షించగలుగుతుందని మంత్రి మండలి వెల్లడించింది. అలాగే మధురవాడ ఐటి హిల్ నెంబర్ 4పై ప్లాట్ నెంబర్లు యుడిఎల్ 1, యుడిఎల్ 2, యుడిఎల్ 3 వద్ద 30 ఎకరాల భూమిని ఎపిఐఐసి ద్వారా ఎకరా రూ.1.50 కోట్లకు సబ్సిడీ రేటుతో మెస్సర్స్ సత్వ డవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించడానికి ఎపి ఐటి అండ్ జిసిసి పాలసీ కింద ఆమోదం తెలిపారు. రూ.1500 కోట్ల ప్రతిపాదిత పెట్టుబడి సత్వ పెట్టనుంది. 25 వేల ఉద్యోగాల కల్పన జరుగనుందని చెబుతున్నారు. మధురవాడ ఐటి హిల్ నెంబర్ 3పై ప్లాట్ నెంబర్ 6 వద్ద 2.5 ఎకరాల భూమిని, హిల్ నెంబర్ 4పై ప్లాట్ నెంబర్ యుడిఎల్ 6 వద్ద 7.79 ఎకరాల భూమిని ఎఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించేందుకు మంత్రి మండలి ఆమోదించింది. ఇక్కడ ఎపి ఐటి అండ్ జిసిసి పాలసీ కింద రూ.1000 కోట్ల పెట్టుబడితో 10 వేల ఉద్యోగాలు వస్తాయని చెప్పింది.

గ్రామీణ ప్రాంతం ఎండాడ గ్రామం (పనోరమా హిల్స్ వెనుక) 30 ఎకరాల భూమిని ఎపిఐఐసి ద్వారా ఎకరానికి ఐఎన్ఆర్ రూ.1.5 కోట్ల చొప్పున బివిఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించడానికి ఐటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కేటగిరీ కింద ప్రాజెక్టును పరిగణలోకి తీసుకుని రూ.1250 కోట్ల ప్రతిపాదిత పెట్టుబడి, 15 వేల ఉద్యోగాల కల్పనకు మండలి ఆమోదం తెలిపింది.

విఎంఆర్‌డిఎ పరిధిలో భూ పందేరం ఇలా...

విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఎ) కమిషనర్‌కు అనకాపల్లి జిల్లా చెరోపల్లి కందం గ్రామంలో 2007లో ప్రారంభించిన ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను 58.18 ఎకరాల వరకూ కొనసాగించడానికి రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించింది. 2016 ల్యాండ్ పూలింగ్ చట్టం ప్రకారం 1941.19 ఎకరాల భూ సేకరణ చేపట్టడానికి అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో విఎంఆర్‌డిఎకు రాష్ట్ర కేబినెట్ అనుమతులను ఇచ్చింది. విశాఖపట్నంలోని 5 నక్షత్రాల లగ్జరీ హోటల్ అభివృద్ధి కోసం కొల్‌కతాలోని ఐటిసి హోటల్స్ లిమిటెడ్‌కు ప్రోత్సాహకాలను అందించేందుకు రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక మండలి (ఎస్ఐపిబి) చేసిన నిర్ణయానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. అదే విధంగా పెదగంట్యాడలోగల మెడ్‌టెక్ జోన్ (ఎఎంటిజెడ్) వద్ద 5 స్టార్ హోటల్ అభివృద్ధి కోసం హైదరాబాద్‌లోని లాన్సమ్ లీజర్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పి వారికి ప్రోత్సాహకాలను అందించేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. వందల ఎకరాలను విశాఖలో ప్రభుత్వం ప్రైవేట్ సంస్థల కోసం సిద్ధం చేస్తుందన్నది మంత్రి మండలి నిర్ణయాలను బట్టి స్పష్టమవుతోంది.

రూ.1.6 కోట్ల సొత్తు రికవరీ

ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ : విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో 2025 జూన్ నెల రికవరీమేళాను గురువారం నగరపోలీస్ కమిషనరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పోలీస్‌కమిషనర్ డా.శంఖబ్రాత బాగ్చి మాట్లాడుతూ 2025 జూన్‌లో 84 కేసులు నమోదయ్యా యని, అందులో 59 కేసులను విజయవంతంగా చేధించామని 73 మంది నేరస్తులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. చోరీ అయిన నగదులో రూ.46,03,665 విలువగల వస్తువులు, నగదుతో పాటు రూ. 60,00,000 విలువ గల 430 మొబైల్ ఫోన్లు కలుపుకుని మొత్తం రూ. 1,06,03,665 విలువగల సొత్తు రికవరీ చేయడం జరిగిందని రికవరీ చేసిన వస్తువులను ఈ రికవరీ మేళా ద్వారా బాధితులకు అందజేస్తున్నామని తెలిపారు. నగరవ్యాప్తంగా జూన్‌లో 440 సిసి కెమెరాలను ఏర్పాటు చేశామని, 108 క్రైమ్ అవేర్‌నెస్ క్యాంపులు నిర్వహించామని ఆయన తెలిపారు. రాత్రి వేళలో గస్తీ నిర్వహణను మరింత పటిష్టం చేశామన్నారు. నగర అధికారులు రూపొందించిన చాట్ బిటి ద్వారా ఇప్పటివరకు రూ. 9.80కోట్ల విలువగల 6,534 మొబైల్ ఫోన్‌లను తిరిగి పోగొట్టుకున్న వారికి అందించామన్నారు. విశాఖ నగర పరిధిలో ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నట్లయితే 9490617916 నెంబర్‌కు చాట్‌బిటి ద్వారా లేదా సిఇఐఆర్ పోర్టల్ ద్వారా తమ ఫిర్యాదులు నమోదు చేయాలని కమిషనర్ సూచించారు. సమావేశంలో క్రైమ్ డిసిపి కె.లతామధురి, క్రైమ్ ఎడిసిపి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి ఆస్తులు అన్యాక్రాంతం కారాదు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: జివిఎంసి ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జివిఎంసి పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ప్రభాకర్‌తో కలిసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జివిఎంసి ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత పట్టణ ప్రణాళిక అధికారులపై ఉందని తెలిపారు. జివిఎంసి పరిధిలో జోనల్ వారీగా ఎన్ని ఖాళీ స్థలాలు, పార్కులు ఉన్నాయని, వాటిలో ఆక్రమణకు గురైన స్థలాలు, కోర్టుకేసులు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని జోన్లలో కలిపి 48 కోర్టు కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కోర్టుకేసులు ఉన్న స్థలాల యొక్క డాక్యుమెంటేషన్ సరైన పద్ధతిలో కోర్టులో ప్రవేశపెట్టడం ద్వారా ఆయా స్థలాలను మనం కాపాడుకోగలుగుతామని పేర్కొన్నారు. జివిఎంసి పరిధిలో ఉన్న ఖాళీస్థలాల పరిరక్షణకు ఆయా జోనల్ అధికారులు బాధ్యత తీసుకుని పరిరక్షించాలన్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నందున చాలావరకూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఫుట్‌పాత్ ఆక్రమణలను వెంటనే తొలగించాలని మేయర్ ఆదేశించారు.

అనంతరం జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ ఆస్తుల పరిరక్షణకు పట్టణ ప్రణాళిక అధికారులు కృషి చేయాలని, ఖాళీ స్థలాలు, పార్కులు ఆక్రమణ జరగకుండా కాపాడాలని, కోర్టు కేసులో ఉన్న స్థలాల యొక్క వివరాల తోపాటు ఆక్రమణ జరిగిన ప్రాంతాల యొక్క ఫొటోలు మేయర్ తో కలిసి పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఫుట్‌పాత్‌లు రోడ్లు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తల్లికి వందనం, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్షిప్ లను త్వరితగతిన విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్ఒ ఆధ్వర్యంలో గురువారం ఆర్టిసి కాంప్లెక్స్ నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, అనంతరం గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.విశ్వనాథ్, కార్యదర్శి వి.లక్ష్మి, మాట్లాడారు.

కేన్సర్ రోగికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్న 36వ వార్డుకు చెందిన జోహార్ బేగం అనే మైనార్టీ మహిళకు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. స్థానిక వైసిపి నేతల ద్వారా విషయం తెలుసుకుని గురువారం ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. తక్షణమే సొంత నిధులు రూ.10వేలను వైద్యఖర్చులకు అందజేశారు. కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, వైసిపి వార్డు అధ్యక్షుడు మహమ్మద్ షకీల్ పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : లాసెన్స్‌బే కాలనీ ఏరియాలో కామత్ హోటల్ ఎదురుగా ఉన్న ఎంపి భరత్ ఆఫీస్ ప్రక్కన ఫుట్‌పాత్‌పైన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని అతని వయసు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని పోలిసులు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హోం లెస్ షెల్టర్ పెద్ద వాల్తేర్ విశాఖపట్నం వారికి సమాచారం అందించారురు. ఎంవి సిఐ ఆదేశాలతో పోలీస్ కానిస్టేబుల్ ప్రశాంత్ ఆధ్వర్యంలో ఆ మృతదేహానికి జ్ఞానాపురం స్మశానవాటికకు తరలించిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హోంలెస్ షెల్టర్ పెద్ద వాల్తేర్ నిర్వాహకులు మురళి అంతక్రియలు నిర్వహించారు.

ఉన్నత చదువులకు ఛారిటీ బాక్స్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారన్న కారణంతో భర్త నిరాదరణకు గురైన ఓ మహిళ తన పిల్లల ఉన్నత చదువుల కోసం 'చారిటీ బాక్సు' సంస్థను ఆశ్రయించింది. తమ సంస్థ తరపున రూ.50 వేలు ఆర్థిక సాయం అందించినట్టు చారిటీ బాక్స్ కోశాధికారి పొట్నూరు వెంకట శివప్రసాద్ తెలిపారు. పెద్దకుమార్తె బిఎస్సి నర్సింగ్, రెండో అమ్మాయి హోటల్‌మేనేజ్‌మెంట్ చదువుతున్నారని, వీరి చదువుల నిమిత్తం మొదటి విడత రూ.50వేల చెక్కు అందజేశారు. చారిటీ బాక్సు ప్రతినిధి పొట్నూరు వెంకట రమణ మాట్లాడుతూ అట్టడుగున ఉన్న వారికి అండగా నిలవడమే చారిటీ బాక్సు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో లక్కోజు నూకరాజు పాల్గొన్నారు. పెదవాల్తేరులో ఉన్న పట్టణ నిరాశ్రయుల వసతి గృహానికి చారిటీ బాక్సు ఆధ్వర్యంలో ఒక ఫ్యాన్ అందజేయడం జరిగింది.

మహా విశాఖ నగర పాలక సంస్థ
లేఔట్ అనుమతిపై ప్రజల అభ్యంతరాలు / సూచనలు

RC No. LAYOUT / APDPM SNo.1086/0009/LP/Z1/2023, Dt. 03-07-2025

ఇందుమూలముగా యావన్మందికి తెలియ చేయునదేమనగ M/s. వల్లభ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, దాని మేనేజింగ్ డైరెక్టర్ ద్వారా ప్రతినిధి వి.కృష్ణ ప్రసాద్, విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం మండలం, నిడిగట్టు పంచాయతి, నేరేళ్లవలస గ్రామం నందలి సర్వే సంఖ్య. 79/1 P, 79/2, 79/3, 79/5 P, 79/6, 79/7, 79/8 P & 80 P లో కవరు చేయబడ్డ విస్తీర్ణం 47097.90 చ.మీ గల భూమిని లేఔట్ అనుమతి నిమిత్తము దరఖాస్తు చేసియున్నారు.సదరు దరఖాస్తు ఈ కార్యాలయం ఫైల్ ఆర్.సి.నెం.1086/0009/LP/Z1/2023 నందు పరిశీలన నిమిత్తమైయున్నది. కావున పైన తెలిపిన లేఔట్ అనుమతి నిమిత్తమై ఎవరికైనను అభ్యంతరములు / సలహాలు కలిగి యున్న యెడల ఈ ప్రకటన జారీ చేసిన తేదీ నుండి 7 రోజులలోపు జి.వి.ఎం.సి కార్యాలయమునకు వ్రాతపూర్వకముగా తెలియచేయవలెను. లేని యెడల ఎట్టి అభ్యంతరములు /సలహాలు లేవని భావించి, సదరు దరఖాస్తు పై తదుపరి చర్య తీసుకొనబడునని తెలియచేయుటమైనది..

Sd/- కమీషనర్, జి.వి.యం.సి.

రికార్డు సమయంలో ఇకెఎం జలాంతర్గామి రీఫిట్

-హిందుస్థాన్ షిప్ యార్డ్ ఘనత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందుస్థాన్ షిప్ యార్డ్ ఇకెఎం జలాంతర్గామి రీఫిట్‌ను రికార్డు సమయంలో పూర్తి చేసింది. ఈ నెల 21కే ఆ పనులు పూర్తి చేసి ఎంఆర్ఎల్‌సి (రీఫిట్ విత్ లైఫ్ సర్టిఫికెట్) కోసం జలాంతర్గామిని సిద్ధం చేసింది. ఈ సందర్భంగా హెచ్ఎస్ఎల్ చైర్మన్ అండ్ ఎమ్‌డి హేమంత్ ఖత్రి గురువారం మాట్లాడుతూ ఈ జలాంతర్గామి నిర్మాణం నాణ్యత, టర్న్ అరౌండ్ సమయాల్లో నూతన మైలు రాయిని చేరుకున్నామన్నారు. ఉద్యోగుల అంకితభావం, శక్తి సామర్థ్యాలే దీనికి కారణమన్నారు. నావెల్ డాక్ యార్డ్, విశాఖపట్నం తూర్పు నేవల్ కమాండ్ మద్దతుతోనే ఇది సాధ్యమైందన్నారు. ఈ పునర్నిర్మాణంలో ఎంఎస్ఎంఇలు కీలకపాత్ర పోషించాయని తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL FAMILY JUDGE AT VISAKHAPATNAM
FCOP.No.2581/2024

Between:
Peddi Hema . . . Petitioner
And:
Peddi Ashok . . . Respondent
To
Respondent
Peddi Ashok, S/o Late Rama Rao, D.No. 12-21-4/1, Seetharama Nagar, Gajuwaka, Visakhapatnam

NOTICE

Please, take notice that the above named Petitioner filed petition for grant of decree of divorce against the respondent and the same was posted to **05-08-2025** for your appearance either in person by an authorized representative at **10.30 A.M.** before the Honourable Court of the Additional Family Court Judge at Visakhapatnam, Andhra Pradesh State, failing which the matter will be decided in your absence

(As per the order of the Honourable Court of the Additional Family Judge at Visakhapatnam)

POLÍNAIDU VUDAMALA
Advocate
Block No.V, Flat No.5RA
J.K. Modern Homes Anthony Nagar
Visakhapatnam-530 002
Cell No.9966631486

In the Honourable Court of the MACT cum IIIrd Addl District Family Judge at Vizianagaram
MVOP 452/2021

Between:
Thota Lakshmana Rao & another ......Petitioner
And :
Kondagorri Ramsai & others ....Respondent

ప్రకటన

M.Trinadh, S/o Simmanna, Door No. 8-169, Chinnagadili, Thotagarruvi Junction, Arilova, Visakhapatnam.

పై ఆసామికి ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా మీపై Thota Lakshmana Rao & another IA 406/25 పెట్టుకొన్న కేసు విషయమై మీ యొక్క వాయిదా **తే 29-7-2025దీ**న మీరు ప్రత్యక్షముగాని, మీ తరుపున ఎవరైన లాయరు గాని **ఉదయం 10-30ని॥** వచ్చి హాజరు కావలసినదిగా శ్రీ కోర్టువారు ఆర్డరు జారీ చేసియున్నారు. మీరు గాని మీ తరపున లాయరు గాని హాజరు కాని యెడల మీపై కోర్టువారు తగుచర్యలు తీసుకోగలరని తెలియజేయడం అయినది.

ఇట్లు
Ch.S.P.Prabhakara Rao
Advocate, Vizianagaram,
Cell : 9966899996

భద్రయ్యపేటకు నేతలు, అధికారుల తాకిడి

- కిడ్నీ బాధితులకు పలువురి పరామర్శ, భరోసా
- గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -పద్మనాభం: కిడ్నీ వ్యాధులు ప్రబలిన మండలంలోని రెడ్డిపల్లి గ్రామపంచాయతీ భద్రయ్యపేట గ్రామానికి గురువారం అధికారులు, నేతలు పోటెత్తారు. బాధిత కుటుంబాలకు పరామర్శించి భరోసా కల్పించే చర్యలు చేపడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భద్రయ్యపేట చేరుకుని కిడ్నీ బాధిత కుటుంబాలు, వైద్యాధికారులతో మాట్లాడారు. గ్రామంలో 29మందికి కిడ్నీ వ్యాధి నిర్ధారణ జరిగిందని అధికారులుస్పష్టం చేయడంతో దీనిపై డిఎంహెచ్ఓ డాక్టర్ పి.జగదీశ్వరరావును ప్రశ్నించారు. చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు తగు సూచనలు చేశారు. ఎమ్మెల్యే గంటాతోపాటు బాధితులను మండల టిడిపి అధ్యక్షులు కె.రమణ, భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పి జగన్నాథం, నాయకులు కె.దామోదర రావు, ఎం నందేశ్వరరావు, ఎంపిడిఓ ఎం.విజయ్‌కుమార్, తహశీల్దార్ కె.ఆనందరావు పరామర్శించారు. అయితే పెయిన్‌కిల్లర్స్ మందులను ఎక్కువగా వాడడం వల్లే కిడ్నీ సమస్యలు వచ్చాయని అసలు సమస్యను పక్కదోవ పట్టించే ప్రకటనలు ముందుకు రావడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొచ్చిన విశాఖకు చెందిన రామబ్రహ్మం అండ్ సన్స్

భద్రయ్యపేటలో తాగునీటి కాలుష్యం వల్లే కిడ్నీ వ్యాధులు ప్రబలాయని ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో గ్రామంలో రూ.3 లక్షల నుంచి రూ.ఐదు లక్షల వ్యయంతో ప్రత్యేక ఆర్‌వోప్లాంట్ ఏర్పాటుకు విశాఖపట్నానికి చెందిన రామబ్రహ్మం అండ్ సన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. పత్రికల్లో వచ్చిన వార్తను చూసి, భద్రయ్యపేటలోని పరిస్థితులకు చలించిపోయి తమ సంస్థ తరుపున దీన్ని ఏర్పాటుచేస్తామని సంస్థ ప్రతినిధి కంచర్ల రాంప్రసాద్ వెల్లడించారు.

పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తా

భద్రయ్యపేటలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సమస్యను డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళతానని జనసేనభీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ తెలిపారు. గురువారం గ్రామాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడి భరోసా ఇచ్చారు. కొన్నాళ్లక్రితం శ్రీకాకుళం జిల్లా ఉద్దానంతో కిడ్నీబాధితుల సమస్యలపై పవన్‌కల్యాణ్ స్పందించారని, ఆమేరకు గత ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకున్నాయని గుర్తు చేశారు. భద్రయ్యపేట బాధితులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు పవన్‌కల్యాణ్ తప్పక తీసుకుంటారని భరోసానిచ్చారు. భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.రామస్వామి నాయుడు ఉన్నారు.

బాధితులకు సిపిఎం నేతల పరామర్శ

బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నేత మూర్తి, తదితరులు

భద్రయ్య పేటలో కిడ్నీ వ్యాధి బాధితులను ఇంటింటికీ వెళ్లి సిపిఎం భీమిలి జోన్ నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి పరామర్శించారు. రెండేళ్ల క్రితం కిడ్నీ వ్యాధితో భర్త సూర్యానారాయణను కోల్పోయిన కోరాడ పగడాలమ్మతో మాట్లాడారు ప్రస్తుతం తాను అదే వ్యాధితో బాధపడుతున్నానని బాధితురాలు వివరించింది. కోరాడ సోములమ్మ, కారిపు కొండమ్మ, కోరాడ అప్పల నరసయ్య, ఇలా గ్రామంలో ని కిడ్నీ బాధితులందరినీ కలిశారు. భద్రయ్యపేట, నమ్మివారి కల్లాలు, సుంకరపేట, దువ్వపేట గ్రామాలకు ప్రత్యేకంగా ఆశా వర్కర్ నియమించాలని డిమాండ్ చేశారు. దూపేట ఆశావర్కర్ ఆల్తి బంగారమ్మ రెండేళ్ల క్రితం మృతి చెందిన తర్వాత వారికి వైద్యసేవలకు దిక్కూచి లేకుండా పోయారని బాధితులు సిపిఎం నేతలకు విన్నవించారు.

వైద్య శిబిరం నిర్వహణ

భద్రయ్యపేట గ్రామంలో గురువారం రేవిడి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ లీలా ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డిఎంహెచ్ఓ డాక్టర్ జగదీశ్వరరావు పాల్గొని వైద్యసేవలను పర్యవేక్షించారు. గ్రామస్తులం దరికీ రక్త పరీక్షలు, బిపి, సుగర్ కిడ్నీ పరీక్షలు నిర్వహించారు. తగు ఆరోగ్యసూచనలు చేయడంతో పాటు మందులు అందజేశారు. గ్రామంలోని పరిసరాలన్నీ పరిశుభ్రత చేయించారు.

వైద్యసేవలను పర్యవేక్షిస్తున్న డిఎంహెచ్ఓ జగదీశ్వరరావు

3న జిల్లా స్థాయి యోగా పోటీలు

ప్రజాశక్తి -తగరపువలస : విశాఖ నగరంలోని ఐఐఎం బిజి నెస్ స్కూల్ డబుల్ రోడ్ వద్ద జిల్లా స్థాయి యోగాసన స్పోర్ట్స్ ఆధ్వర్యంలో వచ్చేనెల 3న జరుగనున్న జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల వారు ఈ నెల 31లోగా పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు ఎ.శంకరరావు, వై కె ప్రభాకర్, టిఎస్‌వి ప్రసాదరావు కోరారు. వయస్సుల వారీగా. పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. సాంప్రదాయ యోగ, ఆర్టిస్టిక్ యోగ, రిథమిక్ యోగ పోటీలు నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9866 022515 , 9000 937083 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు

బదిలీ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు బొగ్గు రోడ్డు -2 వార్డు సచివాలయంలో ఐదేళ్లుగా ఉద్యోగ బాధ్యతలునిర్వర్తించి ఇటీవల వేరే వార్డు సచివాలయాలకు బదిలీ అయిన ఉద్యోగులను స్థానిక టిడిపి నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా సేవలు అందించారని కొనియాడారు. సచివాలయ ఉద్యోగులు సతీష్ కుమార్, శివ రమేష్, లలిత తది తరులను సన్మానించారు. కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షుడు తమ్మిన సూరిబాబు, గరే చంద్రమౌళి, సదానంద, నరవ రామారావు ఉన్నారు

ఆనందపురం : రామవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను 'మేము సైతం' సేవా సంస్థ ఆధ్వర్యంలోపాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. రక్తదాన చైతన్యకర్త, వి.వినోద్ బాబు పాల్గొని బది ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. హెచ్ఎం నాగమణి, సంస్థ అధ్యక్షుడు ఎర్ర వెంకట అప్పారావు, ఉపాధ్యక్షుడు అక్కిరెడ్డి పెంటయ్య, పాఠశాల కమిటీ వైస్ చైర్మన్ రమణ , ఎస్ఎంసి మాజీ చైర్మన్ ఆర్. సూరిబాబు, కార్యదర్శి ఎం. శ్రీనివాస్, ఎంపిటిసి గోలగాని కృష్ణ పాల్గొన్నారు.

రహదారి నాణ్యతపై ఫిర్యాదు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఆరోవార్డులో వుడా చేపడుతున్న 80 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణంలో కనీస నాణ్యత పాటించడం లేదని రేవళ్లపాలెనికి ఆ వార్డు టిడిపి ఉపాధ్యక్షులు నాగోతి వెంకటరావు ఆరోపించారు. గురువారం జోన్-2 కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు

గతంలో రోడ్డు లేని సమయంలో వర్షాల సీజన్‌లో ఇళ్ల ముంగిట నీరు నిలిచిపోతుండడంతో ఎవరికివారే వ్యర్థాలను వేసి చదును చేసుకున్నారని, ఇపుడు రోడ్డు నిర్మాణ సమయంలో ఆయా వ్యర్థాలను తొలగించకుండా దానిపైనే రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్థానికులు ప్రశ్నిస్తే సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడని ఆరోపించారు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టిసారించి, నాణ్యతతో పనులు చేపట్టాలని ఫిర్యాదులో కోరారు.

26న సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి- సీతమ్మధార : సినీ నేపథ్య గాయని చిత్ర పుట్టినరోజు సందర్భంగా ఈనెల 26న సాయంత్రం ఆరు గంటలకు ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గాయని చిత్ర సినీ గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు తెలిపారు. గురువారం జివిఎంసి కార్యాలయంలో సంబంధిత పోస్టర్‌ను మేయర్ పీలా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. కీబోర్డ్ సోమేష్ సంగీత నిర్వహణలో సంగీత విభావరి, పభుత్వ ఉపాధ్యాయిని, గాయని జికె రాధకు 'విశాఖ చిత్ర' బిరుదు ప్రదానం చేస్తామన్నారు. సంగీత ప్రియులు, కళాసంస్థల ప్రతినిధులు పాల్గొనాలని కోరారు. గాయకుడు బి. మురళీధరరావు పట్నాయక్ ఉన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి- సీతమ్మధార : జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మీనాక్షి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగం మధురానగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 400 మందికి ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఆర్ సురేష్ కంటి పరీక్షలు నిర్వహించారు వీరిలో 40 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి, ప్రభుత్వపరంగా ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తామన్నారు. అక్టోబర్ నెలాఖరు వరకు జిల్లాలోని అన్ని పాఠశాలల్లోని ఒకటో తరగతి నుంచి టెన్త్ విద్యార్థులకు అందరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్ మీనాక్షి వెల్లడించారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి -ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డులో నెలకొన్న విద్యుత్ లోవోల్టేజీ, స్తంభాలు, వీధి దీపాల ఏర్పాటు, ఇతర సమస్యలను పరిష్కరించాలని వార్డు కార్పొరేటర్ బోండా జగన్నాథం కోరారు. గురువారం ఎపిఇపిడిసిఎల్ ఎఇఇ వీరరాజుతో కలిసి పర్యటించారు. వార్డులో లోవోల్టేజీతో బాధపడుతున్న ప్రాంతాలను పరిశీలించి, కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో సమస్యను పరిష్కరించాలని సూచించారు. అవసరమైన చోట విద్యుత్‌స్తంభాలు, వీధిదీపాలు ఏర్పాటు చేయాల న్నారు. వార్డు అధ్యక్షులు విజయ రామ రాజు, హాస్పిటల్ కమిటీ మాజీ చైర్మన్ రాజన్ రాజు పాల్గొన్నారు.

జాషువాకు ఘననివాళి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం గుర్రం జాషువా వర్ధంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి సురేఖ, అధ్యాపకులు, విద్యార్థులు జాషువా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా కవిత్వం రాసిన నవయుగ కవి చక్రవర్తి జాషువా అని ప్రిన్సిపల్ కొనియాడారు.

నేరాలు ఘోరాలు

చైన్ స్నాచింగ్ కేసుల్లో ముగ్గురు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-కశింకోట : జిల్లాలో కసింకోట, ఎలమంచిలి, ఎస్ రాయవరం, మాకవరపాలెం, బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో 9 చైన్ స్నాచింగ్ కేసుల్లో ముగ్గురు నిందితులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వారిలో ఒకరు బాలుడు ఉన్నాడు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరులతో డిఎస్‌పి శ్రావణి మాట్లాడుతూ, నర్సీపట్నం దగ్గర శివపురం గ్రామానికి చెందిన కర్రి నానిరెడ్డి, ఎస్.రాయవరం మండలం వాకపాడు గ్రామానికి చెందిన తారుతురి రమేష్‌తో పాటు మరో మైనర్ బాలుడు కలిసి ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలో 9 చైన్ స్నాచింగ్‌లు చేశారు. రోడ్డుపై ఒంటరిగా నడిచి వెళ్లే మహిళలను టార్గెట్ చేసి నిందితులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. వీటిపై ఫిర్యాదులు అందుకున్న పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుండి 26 తులాల బంగారు ఆభరణాలు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. యూట్యూబ్లో చైన్ స్నాచింగ్ దొంగతనాలు ఎలా చేస్తారో చూసి వీరంతా చోరీలకు పాల్పడ్డారని డీఎస్పీ ఎం శ్రావణి వివరించారు. సమావేశంలో సీఐ స్వామి నాయుడు, క్రైమ్ సీఐ అప్పలనాయుడు, ఎస్ఐలు మనోజ్ కుమార్, లక్ష్మణ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయితో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-మధురవాడ : పిఎం.పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయితో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు. వివరాలివి. మన్యం పార్వతీపురం జిల్లా వీరఘట్టం మండలం పనస నందివాడకు చెందిన నవీన్ ఓజోన్ వ్యాలీ వద్ద కిలోన్నర గంజాయి పట్టుబడ్డాడు. అందిన సమాచారం మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి దొరికింది. ఎస్ఐ భాస్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

మహిళను వేధించిన కేసులో నిందితునికి ఏడాదిన్నర జైలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : మహిళను అనుసరిస్తూ, అవమానించడంతోపాటు స్వల్పంగా గాయపరిచిన కేసులో బాజీజంక్షన్‌కు చెందిన ఉరిటి రవీంద్ర అనే నిందితుడిని ఏడాదిన్నర జైలుశిక్షతోపాటు రూ.1,500 జరిమానా విధిస్తూ గురువారం ఒకటవ అదనపు చీఫ్ జుడీషియల్ న్యాయమూర్తి పి. ప్రదీప్ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా మరో నెలరోజులు సాధారణ కారాగారశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఇన్‌ఛార్జి సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ తెలిపిన వివరాల ప్రకారం 2019 జనవరి 26కు ముందు వరకు మహిళను అనుసరిస్తూ, అపహాస్యం చేస్తూ, ఆమె ఇంటిలో కుటుంబ సభ్యులతో టీవీ చూస్తుండగా ముఖంపై కొట్టి, ఛాతీపై నెట్టిన ఆరోపణతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై ఎయిర్‌పోర్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ ఇ.మహేశ్వరరావు దర్యాప్తు నిర్వహించి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ మేరకు తీర్పు చెప్పారు.

162 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సిర్లపాలెం గ్రామంలో గురువారం సిటీ టాస్ ఫోర్స్ బృందం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించింది. ఈ దాడిలో బి. బంగారాజు అనే వ్యక్తి నుంచి 162 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచుతున్నట్టు గుర్తించి, సంబంధిత ఆధారాలతో నిందితుడిని ఆనందపురం పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రతిభకు అభినందన

ప్రజాశక్తి- సీతమ్మధార : తమిళనాడు తిరుచిరాపల్లిలో 19,20 తేదీలలో జరిగిన 6వ పెన్‌కాక్ స్లాట్ సౌత్‌జోన్ పోటీల్లో బోధిధర్మ యుద్ధ కళాక్షేత్రం విద్యార్థులు 15మంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలను సాధించారు. సౌత్‌జోన్ రాష్ట్రాల నుంచి 620 మంది పోటీపడగా, విశాఖకు చెందిన వంశీ కృష్ణ, హర్షిణి, సుబ్బరాజు బంగారు పతకాలు, శ్రీచరిత్, నందిని, కడియం వాసు రజత పతకాలు. ధర్మశీల, కోటేశ్వరరావు,శివ, అలెక్స్, లికిల్ కైలాష్ రాజ్,రాఘవ, స్నేహ విజయ, జగదీశ్, లవ కుమార్ ల కాంస్య పతకాలను సాధించారు. వీరిని విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, పెన్‌కాక్ జిల్లా అధ్యక్షులు, ఆడారి కిషోర్‌కుమార్ అభినందించారు. మాస్టర్ వెంకట్ పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఈనెల 26, 27 తేదీల్లో కంచరపాలెం మెట్టు వద్ద ఎం కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే 13వ సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదంచేయాలని యూనియన్ కంచరపాలెం జోన్ అధ్యక్షులు ఎస్ శ్రావణ్ కుమార్, జనరల్ సెక్రటరీ ఒ అప్పారావు పిలుపునిచ్చారు. గురువారం సంబంధిత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మహాసభల్లో ప్రస్తుతం కార్మికవర్గం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార చర్యలు, రాబోయే మూడేళ్లలో నిర్వహించబోయే కార్యక్రమాలు, పోరాటాలు, ఉద్యమాల రూపకల్పనపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. హిందుత్వ, కార్పొరేట్ అనుకూల విధానాలతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేసే విధానాలు, కార్మికచట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్సను అమల్లోకి తేవడం, కనీస వేతనాలు, శాశ్వత ఉద్యోగాలు, మెరుగైన జీవన పరిస్థితులపై కార్మికులను కదిలించి, భవిష్యత్ కార్యాచరణ రూపకల్పన చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు కంచరపాలెం జోన్ ఉపాధ్యక్షులు వి బాబ్జీరావు, బి సింహాచలం, సహాయ కార్యదర్శులు జి శ్రీనివాసరావు, పి మూర్తి, కమిటీ సభ్యులు ఎస్ సోమేశ్వరరావు, ఏ రవి, ఏ పిట్టోడు, బి గంగరాజు, ఎస్ లక్ష్మణ్, ఎల్లాజీ పాల్గొన్నారు

పిఎఫ్ బకాయిలు చెల్లించాలని ధర్నా

ధర్నా చేస్తున్న సినర్జీస్ కార్మికులు

ప్రజాశక్తి- గాజువాక: పిఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరుతూ గురువారం పిఎఫ్ కార్యాలయం వద్ద సినర్జీస్ కంపెనీ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం రాంబాబు మాట్లాడుతూ 2022 నుంచి కార్మికుల నుంచి కట్ చేసిన డబ్బులను కంపెనీ యజమాని పిఎఫ్ ఖాతాలకు జమ చేయకపోవడం చట్టరీత్యా నేరమన్నారు. తక్షణమే ఆయా సొమ్ములను కార్మికుల పిఎఫ్ ఖాతాలకు జమ చేయాలని కోరారు. దీనిపై పిఎఫ్ కమిసనర్ తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ దాసు, సెక్రటరీ శ్రీనివాస్, సిఐటియు జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎ.లోకేష్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గాజువాక కార్యదర్శి గొలగాని అప్పారావు, రాము, నరేష్ వందమంది కార్మికులు పాల్గొన్నారు.

కూలి డబ్బులు చెల్లించాలని
భవన నిర్మాణ కార్మికుల ఆందోళన

ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి-మధురవాడ: తాము చేసిన పనికి కూలి డబ్బులు ఇవ్వాలని కోరుతూ సిఐటియు మధురవాడ జోన్ కమిటీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేశారు. గురువారం పిఎం.పాలెం క్రికెట్ స్టేడియం సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఎంఎ గఫూర్, షహనాజ్ పర్వన్ దంపతులు నిర్మిస్తున్న నాలుగు అంతస్తుల భవనంలో పనిచేసిన కూలీలకు యజమానులు డబ్బులు ఎగ్గొట్టారని ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకుని తమకు కూలి డబ్బులు ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా కార్మికులు, సిఐటియు నేతలపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు వారిని నెట్టేసేందుకు భవన యజమాని గఫూర్ ప్రయత్నించారని కార్మికులు ఆరోపిస్తున్నారు. కష్టార్జితం కోసం ఆందోళన చేయాల్సిన దుస్థితి రావడం దారుణమని, వెంటనే కార్మికులకు, లేబర్ మేస్త్రికి రావాల్సిన డబ్బులు భవన యజమాని గఫూర్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వి రమణ, కె.ధనలక్ష్మి, కె.మల్లేశ, రమణ పాల్గొన్నారు.

సత్తా చాటిన క్రీడాకారులకు అభినందన

క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి-గోపాలపట్నం : కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి రోల్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో అన్ని విభాగాల్లో సత్తా చాటి, బంగారు, రజత పతకాలను సాధించిన విశాఖ క్రీడాకారులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబును తన క్యాంపు కార్యాలయంలో అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్రీడాకారులు ఇదే స్ఫూర్తితో జాతీయస్థాయిలో రాణించి విశాఖకు మంచి పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రోల్‌బాల్ అసోసియేషన్ స్టేట్ కార్యదర్శి అనిల్‌కుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి తోట లలితప్రియ, కోచ్ పూసర్ల సంతోష్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బొత్సను కలిసిన వైసిపి నేతలు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు వైసిపి అధ్యక్షునిగా నియమితులైన సత్యాల వెంకట్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు గురువారం ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కరణం ధర్మశ్రీలను కలిసి వారిని సన్మానించారు. కార్యక్రమంలో సత్యాల సాగరిక, బంగారు రాజు, బేతా దుర్గారావు, జగదీష్, కాకర గోవింద్, వంకర బాబూరావు, పాండ్రింగి శ్రీను, భాగ్యరాజ్ ఉన్నారు.

బొత్సను అభినందిస్తున్న 13వ వార్డు వైసిపి నేతలు

కూటమి వైఫల్యాలను ఎండగట్టండి

క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : హామీల అమలులో వైఫల్యం, కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రజలకు తెలియజేప్పాలని వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు అన్నారు. గురువారం జివిఎంసి 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహారాణి పార్లర్ దరి ఫంక్షన్ హాల్‌లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, అమలుకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ప్రశ్నించిన విపక్ష నేతలపై కక్షపూరితంగా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. వార్డులో ఇంటింటికి వెళ్లికూటమి అక్రమాలు, మోసాలను వివరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్ధారణకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- సీతమ్మధార : టిబి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా 53వ వార్డు డాక్టర్ జాకీర్ హుస్సేన్ నగర్‌లో యుపిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఎన్.అనూష ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆ వార్డు మాజీ కార్పొరేటర్ పివి. నరసింకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ అనూష మాట్లాడుతూ, టిబి ముక్త్ భారత్ అభియాన్‌లో క్షయవ్యాధి కేసులను గుర్తించడం, తగు చికిత్స, మందులు అందించడం ద్వారా రమణాలను తగ్గించాలన్న ప్రభుతవ ఆదేశాలతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామన్నారు. వ్యాధి, లక్షణాలున్న వారు, అనుమానితులకు కెళ్లె పరీక్ష నిర్వహించి, వ్యాధి నిర్ధారణ జరిగితే ఆశాకార్యకర్త పర్యవేక్షణలో మందులు వాడేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ టిమధు, టిబి సూపర్వైజర్ సూర్య నారాయణ, హెచ్‌వి మణి, ఎఎన్‌ఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఏసర్ ఈ బైక్ గో అవుట్‌లెట్ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఏసర్ అధికారిక లైసెన్స్ పొందిన,భారతదేశంలో అత్యంత ఫార్వర్డ్ థింకింగ్ ఎలక్ట్రిక్ మొబిలిటీ స్టార్టప్‌లలో ఒకటైన ఈబైక్ గో ప్రైవేట్ లిమిటెడ్ విశాఖపట్నంలో కొత్త ఏసర్ ఎలక్ట్రిక్ వెహికల్స్ రిటైల్ అవుట్‌లెట్‌ను గురువారం రైల్వే న్యూ కాలనీ డాక్టర్ అవెన్యూ, శ్రీ సిద్ధి ఎన్ క్లేవ్‌సంస్థ సహవ్యవస్థాపకులు, సిఇఒ శ్రీహరి కిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 15 ఫ్లాగ్‌షిప్ ప్రదేశాల్లో ఒకటైన ఈ స్టోర్ ఏసర్‌తో బ్రాండ్ లైసెన్సింగ్ భాగస్వామ్యం ద్వారా అభివృద్ధి చేయబడిన అత్యాధునిక ఏసర్-బ్రాండెడ్ ఎలక్ట్రిక్ వాహనాలను విశాఖ నగరంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పర్యావరణ అనుకూల రవాణా,స్మార్ట్ మొబిలిటీపై నగరం పెరుగుతున్న దృష్టికి అనుగుణంగా, ఈ-స్కూటర్లు, ఈ-బైక్‌లు, ఈ-సైకిళ్లతో సహా ఏసర్-బ్రాండెడ్ ఎలక్ట్రిక్ వాహనాలునగర ప్రజలకు స్టైలిష్,సుస్థిరమైన, అధిక-పనితీరు గల రవాణా పరిష్కారాలను అందించడమే ఈబైక్ గో లక్ష్యం అన్నారు. ఈ-సైకిళ్ల ధర రూ35,999 నుండి ప్రారంభమవుతుందన్నారు

నేడు న్యాయవాదుల మహా ధర్నా

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మధ్యాహ్నం 11 గంటలకు న్యాయవాదులు మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర పరిపాలన అధ్యక్షుడు కెఎస్ఎస్ సురేష్ కుమార్ తెలిపారు. విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు, న్యాయవాదుల చట్ట సవరణ, మరణానంతరం కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల చెల్లింపు, జనాభా నిష్పత్తి ప్రాతిపదికన న్యాయమూర్తుల భర్తీ, అర్హులైన న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు, నూతన జూనియర్ న్యాయవాదుల ఆర్థిక సహాయాన్ని రూ.పదివేలకు పెంపు వంటి 11 డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని కోరుతూ మహాధర్నా చేస్తున్నామన్నారు. న్యాయవాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నియోజకవర్గ పరిధిలోని 8 మందికి సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.6.14 లక్షల చెక్కులను గురువారం ఎంవిపి కాలనీలోని తన నివాసంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అందజేశారు. 5వ వార్డు బొట్టవానిపాలేనికి చెందిన నమ్మి వెంకట సాయి హేమంత్ కు రూ.1.29 లక్షలు, 6వ వార్డు పీఎం పాలెంకు చెందిన మొజ్జాడ ఇందిరకు రూ.1.17 లక్షలు, ధూళిపూడి ఆంజనేయులుకు రూ. 80 వేలు, కొరజంగి సూరిబాబుకు రూ. 75 వేలు, పద్మనాభం మండలం మద్ది గ్రామానికి చెందిన బుగత సన్యాసినాయుడికి రూ. 84 వేలు, 8 వ వార్డు ఎన్టీఆర్ కాలనీకి చెందిన నక్క ప్రభాకర్‌రావుకు రూ. 50 వేలు, ఆనందపురం మండలం పాలవలస గ్రామానికి చెందిన కొల్లి శ్రీనుకు రూ. 35 వేలు చెక్కులను ఇచ్చారు. ఆపదలో ఉన్న వారిని ప్రభుత్వం ఎప్పుడూ ఆదుకుంటుందని గంటా భరోసానిచ్చారు.కార్యక్రమంలో విశాఖ పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్, రెడ్డి సత్యనారాయణ, కొల్లి బాబ్జీ, కొప్పాక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

కరపత్రాలను పంచుతూ ప్రచారం చేస్తున్న నాగజగదీష్

ప్రజాశక్తి - ములగాడ: జివిఎంసి 40వ వార్డు ఎకెసి కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, కరపత్రాలను పంపిణీ చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గేదెల రమణ, మాజీ అధ్యక్షులు ఆర్ఆర్ రాజు, కార్యదర్శులు రామారావు పాల్గొన్నారు

అనకాపల్లి రూరల్ : జివిఎంసి 81వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా విల్లూరి పరంధామయ్య, పీలా నాయుడు వీధి, ఉమెన్స్ కాలేజ్ ఏరియాలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు తదితరులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో చదరం శివ, పెంటకోట శివరాం, పొలిమేర నాయుడు, మల్ల గణేష్, కోరుకొండ అప్పారావు, కొణతాల సత్యనారాయణ, బుద్ధ లక్ష్మీ అప్పారావు, వేగి నాయుడు, కర్రి వెంకటరావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

పాదయాత్రలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

మాట్లాడుతున్న సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి -ములగాడ

ప్రజలపై భారాలు మోపే అదాని ఫ్రీ పెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రతిఒక్కరూ అడ్డుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు పిలుపునిచ్చారు. గురువారం 58వ వార్డు అజంతా కాలనీ, ఉప్పర కాలనీ అపార్ట్మెంట్స్‌లో సిపిఎం పాదయాత్రలో జగ్గునాయుడు మాట్లాడుతూ, స్మార్ట్ మీటర్లతో ఏర్పాటుతో ఛార్జీల మోత మోగుతుందన్నారు. అంతేకాక స్మార్ట్‌మీటర్ల ధరను కూడా వాయిదాల పద్ధతిన వినియోగదారుల నుంచి వసూలు చేయడం దుర్మార్గమన్నారు. వైసిపి పాలనలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించడంతోపాటు ఇళ్లకు బిగించేందుకు వస్తే బద్దలుగొట్టాలని లోకేష్ పిలుపునిచ్చారని, ఇపుడు ఎలా బిగిస్తారని ప్రశ్నించారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం వెనక్కు తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి పైడిరాజు మాట్లాడుతూ శ్రీహరిపురం రిఫరల్ యూనిట్‌ను వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి జివిఎంసి నిర్వహించాలన్నారు. మల్కాపురం జోన్ నాయకులు ఆర్ లక్ష్మణ మూర్తి మాట్లాడుతూ ములగాడ నుండి మారుతీ జంక్షన్ వరకు నూతన రోడ్డు నిర్మించాలని, ప్రైవేట్ గొడౌన్స్ దుమ్ముధూళి కాలుష్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో జోన్ నాయకులు కె. పెంటారావు, ఎం శ్రీనివాస్, సత్యారావు, బూడి శ్రీను, పిసిని రామారావు సిపిఎం కార్యకర్తలు నరేష్, సవీన్, దుర్గాప్రసాద్, సత్తిబాబు, గంగాధర్, రామకృష్ణ సుభాన్, గణేష్, అర్జున్ రావు, నీలయ్య, ఈశ్వరరావు, వార్డు నాయకులు ఆర్ దేవరాజు, స్థానికులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అదాని స్మార్ట్ మీటర్ల వల్ల వినియోగదారులకు తీవ్ర నష్టం కలుగుతుందని, ఆ మీటర్లు ఇళ్లకు బిగించకుండా అడ్డుకోవాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు అనకాపల్లి అంబేద్కర్ నగర్లో సిపిఎం నాయకులు తేలయ్యబాబు తదితరులు గురువారం కరపత్రాలను పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. స్మార్ట్ మీటరుకు సెల్ఫోన్ పద్ధతిలో మాదిరిగా ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జీ చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అదాని కంపెనీ ఆన్‌లైన్‌లో రీడింగ్ చూసి బిల్లు పంపిస్తుందని, వీటికి సమాధానం చెప్పే నాథుడు ఉండడని పేర్కొన్నారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టిడిపి కూటమి నాయకలు నేడు వాటిని బిగించి ప్రజలపై భారాలు మోపడానికి సిద్ధం కావడం సిగ్గుచేటన్నారు.

కశింకోట : విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించవద్దని కశింకోటలో గురువారం సిఐటియు, ప్రజా సంఘాల నేతలు కరపత్ర ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు విద్యార్థులతో మాట్లాడుతూ అదాని కంపెనీకి లాభాలు దోచిపెట్టడానికి ఈ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆదేశాను సారం గత వైసిపి, నేటి కూటమి ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నాయని విమర్శించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించకుండా తమ తల్లిదండ్రులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు.

కరపత్ర ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

విద్యార్థులతో మాట్లాడుతున్న సిఐటియు నేత శ్రీనివాసరావు

టిడిఆర్ బాండు అందిస్తున్న కలెక్టర్, ఆర్‌డిఒ

రోడ్డు విస్తరణ నిర్వాసితులకు టిడిఆర్ బాండ్లు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి - అచ్యుతాపురం వరకు ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా, భమి, ఇళ్లు కోల్పోయిన బాధితులకు పరిహార చర్యల కింద టిడిఆర్ బాండ్లను గురువారం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చేతులమీదుగా ఇద్దరు భూ నిర్వాసితులకు తన ఛాంబర్‌లో అందజేశారు. భూములు కోల్పోయిన ఇతర నిర్వాసితులు కూడా సుముఖతతో ముందుకు వచ్చి, తగిన దస్తావేజులతో టిడిఆర్ బాండ్లు తీసుకోవాలని ఆమె కోరారు. అచ్యుతాపురం మండలం కొండకర్ల గ్రామానికి చెందిన కోసూరి నారాయణరావుకు 19.11 చదరపు గజాలు స్థలాన్ని రహదారి విస్తరణకు ఇవ్వగా, దానికి నాలుగు రెట్లు మొత్తం 76.4 చదరపు గజాలు, మునగపాక మండలం జేపీ అగ్రహారం గ్రామానికి చెందిన కె అనురాధకు చెందిన 28.7 చదరపు గజాలు స్థలానికి 114.8 చదరపు గజాలు నిర్మాణ హక్కులు కలిగిన టిడిఆర్ బాండ్లను మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో షేక్ అయిషా, మునగపాక తహశీల్దార్ పి.సత్యనారాయణ, అచ్యుతాపురం తహశీల్దార్ జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు బకాయి జీతాలు చెల్లింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం కొత్తూరు మేజర్ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు బకాయి పడిన రెండు నెలల జీతాలు చెల్లించారు. పంచాయితీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు, ఏఐటీయూసీ నాయకులు వైఎన్ భద్రం ఆధ్వర్యంలో బకాయిపడిన జీతాలు చెల్లించకుంటే సమ్మె చేస్తామని పంచాయతీ కార్యదర్శికి, పాలకవర్గానికి తెలియజేయడంతో వారు తీసుకొని రెండు నెలల జీతాలు చెల్లించారు. దీనిపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కలిగొట్ల నాయుడు, చివ్వేటి నేస్తాలు, చెట్ల లక్ష్మీ, చెవిటి నాగేష్, సమ్మింగ్ మంగ, ఎస్ రత్నం పాల్గొన్నారు.

పెద్దాపురం వ్యభిచార గృహాల ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలి : ఐద్వా

ప్రజాశక్తి-పరవాడ : కాకినాడ జిల్లా పెద్దాపురంలో మహిళలను మోసం చేసి వ్యభిచారం కూపంలోకి దించుతున్న ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ భారతి అనే మహిళ వ్యభిచార గృహం నడుపుతూ, నిస్సాహాయ స్థితిలో ఉన్న మహిళలను మాయమాటలతో వలలో వేసుకొని వ్యభిచారం చేయిస్తుందని పేర్కొన్నారు. బాధితురాలు శిరీష పెట్రోల్ బంకులో పని చేస్తుండగా ఇంట్లో పనికి తీసుకెళతామని, నెలకు రూ.15 వేలు జీతం ఇస్తామని చెప్పి మోసం చేసి వ్యభిచారం ఊబిలోకి నెట్టిందని పేర్కొన్నారు. ఈ ముఠా చేతిలో శిరీష గర్భవతిగా మారి ఓ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత, ఆ బిడ్డను చంపేస్తామని బెదిరించి మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని వివరించారు. ఆమె ఐదు సంవత్సరాలుగా న్యాయం కోసం పోరాడుతున్నా, ఇప్పటివరకు ప్రభుత్వ యంత్రాంగం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఆడపిల్లలకు అన్యాయం జరిగితే నేనే ముందుంటాను అని ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిన డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఈ వ్యవహారాన్ని పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. వ్యభిచార ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని మాణిక్యం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు మాన్యాల బంగారమ్మ, కార్యదర్శి తుంపాల అన్నపూర్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షులు మాణిక్యం

రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న లక్ష్మీనారాయణ

ఎఎంఎఎల్ కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఏఎమ్ఏఎల్ కళాశాలలో యాజమాన్యం, మేము సైతం సమాజం కోసం సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అనకాపల్లి వర్తక సంఘ గౌరవ కార్యదర్శి కొణతాల లక్ష్మీ నారాయణరావు 73వ జన్మదినాన్ని పురస్కరించుకొని కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. విశాఖపట్నం ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంకు డాక్టర్స్, ప్రతినిధులు వచ్చి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి రక్తాన్ని సేకరించారు. ఈ శిబిరంలో మొత్తం 103 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు, వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్, సూపరింటెండెంట్ అనురాధ, వివిధ శాఖాధిపతులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల పూర్వ, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.

జోరుగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని వెన్నెల పాలెం గ్రామంలో రెండు రోజులుగా పారిశుధ్య పనులు జోరుగా సాగుతున్నాయి. మురుగు కాలవల శుభ్రత పనులను గురువారం పంచాయతీ కార్యదర్శి కె.భారతి పర్యవేక్షించారు. బీసీ కాలనీలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు, మెడికల్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన పోలీసులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే కసింకోట బంగారు మెట్టు రోడ్డులోని దిబ్బిడి లచ్చన్న నుయ్యి వద్ద పడిని పెద్ద గుంతను పోలీసులు గురువారం పూడ్చిపెట్టారు. ఈ గుంతలో నీరు చేరుతుండడంతో మరింత పెద్దదిగా మారింది. రెండు అడుగుల లోతు పది అడుగుల వెడల్పుతో గుంత పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో ఎఎస్ఐ ఎన్ భాస్కర్ ఆధ్వర్యంలో పోలీసులు సిమెంట్ పిక్క ఇసుక మిశ్రంతో కప్పారు.

రోడ్డు విస్తరణ నిర్వాసితులకు న్యాయం చేయాలి

సంతకాల సేకరణ సందర్భంగా మాట్లాడుతున్న రామ సదాశివరావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అనకాపల్లి-అచ్చుతాపురం రహదారి విస్తరణ నిర్వాసితులకు న్యాయం చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని హరిపాలెం, తిమ్మరాజుపేట గ్రామాలలో గురువారం రహదారి విస్తరణ బాధితులతో సమావేశాలు నిర్వహించి వారి చేత సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణ బాధితుల సంఘం కన్వీనర్, ఆర్.రాము, కో కన్వీనర్ కె.రామ సదాశివరావు, సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేసి నిర్వాసితులకు ఆర్థికపరంగా న్యాయం చేయకూర్చాలని కోరారు. విఎంఆర్‌డిఎ ద్వారా టిడిఆర్ బాండ్లు ప్రతిపాదన విరమించుకోవాలన్నారు. ఎవరెన్ని మాయ మాటలు చెప్పిన నమ్మకుండా పరిహారం కోసమే నిర్వాసిలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. టిడిఆర్ వలన మధ్యవర్తులు, బిల్డర్లుకు ఉపయోగం ఉంటుంది తప్ప నిర్వాసితులకు కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం, సిపిఎం నాయకులు కూండ్రపు సోము నాయుడు, ఎస్ కన్నమునాయుడు, బుద్ధ రంగారావు, బాబురావు, శివ అప్పలనాయుడు, భవిరిశెట్టి రవికుమార్, ఆడారి రామకృష్ణ, కాండ్రేగుల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలతో నష్టపోతున్న రైతులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

నాసిరకం విత్తనాలతో రైతులు నష్ట పోతున్నారని మండలంలోని కేపీ అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక రైతు సేవా కేంద్రం ద్వారా రైతులు తీసుకున్న ఆర్జెఎల్ వరి విత్తనాలు సరిగ్గా నాటలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించిన విత్తనాలే నాటక పోతే ఎలా అని ప్రశ్నించారు. వరి నాట్లుకు అదును దాటి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు మొలకశాతం పరీక్షించకుండావిత్తనాల విక్రయానికి అనుమతులు ఇచ్చేశారని విమర్శించారు. నాసిరకం విత్తనాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

పూర్తి స్థాయిలో మొలకలు రాని వరి విత్తనాలు

సిఎం సహాయ నిధి చెక్కు అందిస్తున్న గేదెల సత్యనారాయణ

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-వడ్డాది : అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న యలంకాయల లక్ష్మీ కృపావతి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.23,400 చెక్కును గురువారం విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. ఇటీవల ఆమె తీవ్ర అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందగా, వైద్యానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణను ఆశ్రయించారు. ఆయన స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు తెలియజేయగా, ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ నుండి ఆర్థిక సాయం మంజూరు చేయించారు.

కలెక్టర్ ఆదేశాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గవరపాలెం వద్ద ముత్రాసి వీధిలో అనధికారిక బావికి వేసిన విద్యుత్ కనెక్షన్ తొలగించాలని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ ఇచ్చిన ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని కాలనీ ప్రజలు గురువారం నిరసన తెలియజేశారు. ముత్రాసి వీధిలోని బుద్ధ రమణాజీ పేరుతో గత కొన్నేళ్లు గా వీధిలోని పాడుబడిన బావిలో అనధికారిక విద్యుత్ కనెక్షన్ ద్వారా నీటిని వ్యాపారం చేస్తున్నారని పేర్కొన్నారు. రక్షణ గోడ లేకపోవడం, శిథిలమై చెత్తతో నిండిపోయి ఉన్న ఈ బావి నుండి వస్తున్న తీవ్ర దుర్వాసన, దోమలు వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై మూడేళ్లుగా వివిధ స్థాయిల్లో ప్రభుత్వానికి, అధికారులకు విన్నవించామని తెలిపారు. దీనిపై వాటర్, ల్యాండ్ ట్రీ యాక్ట్ (వాల్టా) చట్టం ప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈనెల 21న ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కి, జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్‌కు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఈ బావికి ఉన్న విద్యుత్ కనెక్షన్‌ను తక్షణమే తొలగించాలని ఆదేశాలు ఇచ్చారనిఇ పేర్కొన్నారు. కాని నేటికీ ఆ విద్యుత్ కనెక్షన్ తొలగించకపోవడంతో స్థానికులు గురువారం కలెక్టర్ ఉత్తర్వులతో బావి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చింతా ఓంశివ, గుడాల సత్యనారాయణ, మైపాలి సూరిబాబు, బొడ్డు శ్రీనివాసరావు, శనిగంటి దుర్గాప్రసాద్, సిహెచ్ మణి, వి నాగు, పాల్గొన్నారు.

27న గ్రామ రైతు సంఘం సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-మునగపాక : మునగపాక గ్రామ రైతు సంఘం సర్వసభ్య సమావేశం ఈనెల 27వ తేదీన స్థానిక బైపాస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న రాహుల్ గాంధీ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు ఎఎస్‌వి.మహేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సర్వసభ్య సమావేశానికి గ్రామంలోని వివిధ సంఘాల ప్రతినిధులు, గ్రామ రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వనభోజన కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

చెర్లోపల్లి లే అవుట్‌కు కేబినెట్ ఆమోదంపై హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలో చెర్లోపలి ఖండం వీఎంఆర్‌డిఎ లే అవుట్‌కు శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ చొరవతో మోక్షం కలిగిందని కూటమి నాయకులు పేర్కొన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏపి కేబినెట్ సమావేశంలో వీఎంఆర్‌టిఎ లేఅవుట్‌కు ఆమోదం తెలపడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. గత 18 సంవత్సరాల నుండి అపరిష్కృతంగా వున్న ఈ సమస్య పరిష్కారమైందని తెలిపారు. ఈ సమావేశంలో దూలం గోపి, పీలా నాగశ్రీను, బిఎస్ఎంకె జోగినాయుడు, ఆళ్ల రామచంద్ర రావు, బుద్ద శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్ బోర్డు మరమ్మతు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ 83వ వార్డు భీమునిగుమ్మం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎలిమెంటరీ స్కూల్లో విద్యుత్ సరఫరా బోర్డు మరమ్మతు చేయాలని వైసిపి నాయకులు జాజుల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విద్యుత్ బోర్డు పాడైపోవడంతో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టడంలో ఇబ్బంది అవుతుందని, స్కూల్ హెచ్ఎం యడ్ల రాణి, సమ్మంగి కనకరావు తదితరులు వైసిపి వార్డు ఇన్‌ఛార్జి జాజుల రమేష్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఆయన పాఠశాలకు చేరుకొని సంబంధిత పబ్లిక్ వర్క్స్ ఏఈ కుమార్‌కు తెలియచేశారు. దీనిపై ఏఈ కుమార్ సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తట్టా అరవింద్, బోనెల సాయి, నడిశెట్టి గోవింద్, రెడ్డి చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ కాలనీలో జ్వరాలు

ఇద్దరు బాలలకు డెంగీ నిర్ధారణ

ప్రజాశక్తి-రాంబిల్లి : రాంబిల్లి మండలం, లోవపాలెం పంచాయతీ పరిధి ఎన్‌టిఆర్ కాలనీలో ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. 10 మందికి పైగా జ్వరాల బారిన పడగా, వారిలో ఇద్దరికి డెంగీ నిర్ధారణ అయింది. గ్రామానికి చెందిన ఎరిపిల్లి రేణుక కుమారుడు అక్షయ్‌కు జ్వరం తీవ్రంగా రావడంతో విశాఖపట్నం కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి తరలించగా, డెంగీ జ్వరంగా నిర్ధారణ అయింది. అలాగే ఎరిపిల్లి యశ్వంత్ అనే బాలుడు డెంగీతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో బాలుడి ఆరోగ్యం సీరియస్‌గా ఉందని తెలిసింది. గ్రామంలో పది మందికిపై జ్వరాలతో బాధపడుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

పారిశుధ్య నిర్వహణ లేక దోమల వృద్ధి

ఇటీవల కురిసిన వర్షాలకు డ్రైనేజీలు లేకపోవడంతో ఎక్కడ నీరు అక్కడ రోడ్డు మార్గంలో నిలిచిపోవడంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందాయి. దీంతో ప్రజలు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు బారిన పడ్డారు. జ్వర బాధితులకు వైద్యం చేయించుకోవడానికి ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేక, ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో వేలకు వేలు ఖర్చు పెట్టవలసి వస్తుందని బాధితులు వాపోతున్నారు. గ్రామంలో డ్రైనేజీలు వంటి మౌలిక వసతులు కల్పించాలని, మురుగునీరు నిల్వ లేకుండా, చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని ఎన్నిసార్లు పంచాయతీ, మండల స్థాయి అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి ఉన్నతాధికారులు, డిఎంహెచ్‌వో స్పందించి తమ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

డెంగీతో చికిత్స పొందుతున్న బాలుడు

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని కింతాడ ఫీడర్ పరిధిలో ఉన్న గ్రామాల్లో విద్యుత్తు లైన్లు సరి చేయడం, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించడం కారణంగా ఆ పరిధిలో శుక్రవారం విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా కింతాడ, జోగన్నపాలెం, గొల్లలపాలెం, ఆర్లి, కె.సంతపాలెం, చంద్రయ్యపేట, గొంపవానిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

మునగపాక : స్థానిక 11కెవి సబ్ స్టేషన్ మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మునగపాక, తిమ్మరాజుపేట, కొత్త నాగవరం, పాతనాగవరం, వాడ్రాపల్లి, గొల్లపాలెం, కుంచవాని పాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుందని పేర్కొన్నారు.

సబ్బవరం : 33/11కేవీ సబ్బవరం సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ పనులు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల సబ్బవరం, ఇరువాడ, ఆసకపల్లి, పైడివాడ, గొల్లలపాలెం, తవ్వవానిపాలెం, అమతపురం పంచాయతీల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం సబ్ స్టేషన్ పనులు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని కశింకోట ఈఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కన్నూరుపాలెం, తీడ, చౌరకం, లాలంకొత్తూరు, సుందరయ్యపేట, ఆనందపురం, జి.భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మోసయ్యపేట, గోకువానిపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

అనకాపల్లి : కసింకోట సబ్ స్టేషన్ 33/11 కెవి మరమ్మతులు, హెచ్‌టి / ఎల్‌టి లైన్లు కింద ఉన్న చెట్టుకొమ్మలు తొలగింపు కారణంగా కొత్తూరు సెక్షన్ కార్యాలయం పరిధిలోని కొత్తూరు, సత్యానారాయణపురం, మూలపేట, వేట జంగాల పాలెం, సంపతిపురం, కూండ్రం, కుంచంగి రొంగలి వాని పాలెం, పిసినికాడ గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గృహ, వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఈఈ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

కోటవురట్ల : మండలంలో వెంకటాపురం సబ్ స్టేషన్ పరిధిలో తంగేడు, సుంకపూరు, జల్లూరు, బికెపల్లి, తడపర్తి, వెంకటాపురం, కొడవటి పూడి, విశ్వనాధపురం, కె కొత్తూరు, ఆర్ కొత్తూరు గ్రామాలకు ఈనెల 25న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లైన్ క్లియరెన్స్, మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని నర్సీపట్నం విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ అప్పారావు తెలిపారు.

ఆనందపురం : ఆనందపురం సబ్‌స్టేషన్ 11 కెవి పెద్దిపాలెం ఫీడర్‌లో నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ ఎఇఇ అప్పలనాయుడు తెలిపారు. మెట్టమీద పాలెం, పాలవలస, పొడుగుపాలెం, చందక, వెంకటాపురం, జగన్నాధపురం, గొట్టిపల్లి, కుసులవాడ, చీమలమెట్ట వానిపాలెం గ్రామాలలో గృహ, వ్యవసాయ, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

మధురవాడ : స్టేడియం, ధర్మపురి కాలనీ, నవోదయ ఫీడర్ల పరిధిలోని 11కెవి లైన్లలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ జోన్ ఆపరేషన్స్ విభాగం ఇఇ సింహాచలం నాయుడు తెలిపారు. కొమ్మాది జంక్షన్, వైభవనగర్, ప్రశాంతినగర్, వసంత్‌విహార్ ఏరియా, విజయం స్కూల్ టీచర్స్ లేఔట్, రిక్షా కాలనీ, సూర్యశక్తి నగర్, ధర్మపురి కాలనీ, బింద్రానగర్, పిలకవానిపాలెం, షిప్‌యార్డ్ లేఔట్, ఎంవివి సిటీ రోడ్డు ఏరియా, ఎంజిఆర్ లేఔట్, మిథిలాపురి ఉడాకాలనీ మెయిన్ రోడ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎన్నికైన విద్యార్థి నాయకులు

పాఠశాల విద్యార్థి నాయకుల ఎన్నిక

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

ప్రజాస్వామ్యంలో ఎన్నికల విధానంపై విద్యార్థులకు అవగాహన కలిగే విధంగా పాఠశాల విద్యార్థి సంఘం నాయకుల ఎన్నిక మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో ఎస్‌పిఎల్ విభాగంలో ఇద్దరు లీడర్లకు ఐదుగురు విద్యార్థులు పోటీ చేశారు. సాధారణ ఎన్నికల మాదిరి బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసి పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించారు. 3 నుండి 10వ తరగతి విద్యార్థులందరూ ఓటు వేశారు. ఎన్నిక నిర్వాహణకు పిఒ, ఏపిఒ, ఓపిఒ, పోలీసులుగా విద్యార్థులను నియమించారు. ఓట్ల లెక్కింపు అనంతరం సుంకర తేజ 118 ఓట్ల మెజార్టీతో ఎస్‌పిఎల్-1గా శివ్యాది లత 25 ఓట్ల మెజార్టీతో ఎస్‌పిఎల్-2గా గెలుపొందినట్లు ప్రకటించారు. ఈ ఎన్నికలో నూరు శాతం ఓట్లు చెల్లుబాటు కావడం విశేషం. గెలుపొందిన ఇద్దర లీడర్లను పాఠశాల అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయించి నియమ నిబంధనలు తెలియజేశారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు డివిజె అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాయింట్ ఎల్‌పిఎం వన్ టైం ఫీజు మినహాయింపు గడువు పెంపు

ప్రజాశక్తి-అనకాపల్లి : జాయింట్ ఎల్‌పిఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్) సబ్ డివిజన్ కొరకు ఆన్లైన్‌లో (మీ సేవ/ గ్రామ, వార్డు సచివాలయం) ద్వారా దరఖాస్తు చేసిన అభ్యర్థులకు, గతంలో అమలులో ఉన్న వన్ టైం ఫీజు మినహాయింపు గడువు ఈ ఏడాది డిసెంబర్ 31వరకు పొడిగించడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపి ప్రభుత్వ రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జీవోఆర్‌టి నెంబర్ 755 ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ వన్ టైం ఫీజు మినహాయింపు ప్రయోజనాన్ని పొందేందుకు జిల్లాలో అర్హులైన దరఖాస్తుదారులు నిర్ణీత గడువులోగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని మర్రివలస గ్రామంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. స్థానిక సంఘమిత్ర రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో విశాఖపట్నం ఎల్‌వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వైద్య సిబ్బంది నేత్ర పరీక్షలు చేశారు. సుమారు 150 మందికి స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించి 20 మందికి కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. 15 మందిని కేటరాక్ట్ ఆపరేషన్లకు ఎంపిక చేసి విశాఖపట్నంలోని ఆసుపత్రికి తరలించారు. క్యాంప్ కోఆర్డినేటర్ శివకుమార్, ఆప్టో స్పెషలిస్ట్ సాయి, ఫీల్డ్ అసిస్టెంట్లు సంతోషి, భూపతి, యశ్వంత్ గీతాశ్రీతో పాటు సంఘమిత్ర రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ప్రధాన కార్యదర్శి బొంతు మంగపతిరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు చేస్తున్న ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి సిబ్బంది

క్వారీని రద్దు చేయాలని..

రెండో రోజూ కొనసాగిన నిరసన దీక్ష

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలంలోని జి.కోడూరు గ్రామ సర్వే నెంబర్ 332లో రాళ్ల క్వారీని రద్దు చేయాలంటూ దళిత రైతులు, దళిత సంఘాలు, ప్రజా సంఘాలు నర్సీపట్నం ఆర్‌డీఓ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్ష గురువారం కొనసాగింది. ఈ దీక్షలో రైతులు, స్థానికులు, వివిధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్వారీతో గ్రామీణ ప్రాంతాల్లో శబ్ద కాలుష్యం పెరిగిందని, నీటి వనరులు కలుషితమయ్యాయని ఆందోళనకారులు తెలిపారు. వ్యవసాయ భూములకు నష్టం వాటిల్లిందని, పంటల దిగుబడి తగ్గిందని, ఈ రాళ్ల దుమ్ముతో పశువులకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యపరంగా తీవ్ర ప్రభావం పడుతోందని గ్రామస్తులు తెలిపారు. క్వారీ అనుమతుల మంజూరు ప్రక్రియలో పారదర్శకత లేకుండా పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించారని ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. క్వారీలకు భవిష్యత్తులో అనుమతులు ఇచ్చే ముందు రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. క్వారీని రద్దు చేయకుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద దీక్షకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు చిరంజీవి, ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ బొట్టా నాగరాజు, మట్ల చంటిబాబు , సామాజిక ఉద్యమ నేత శివ నారాయణ రాజు, బాధిత రైతుల సంఘం నాయకులు అప్పారావు, లావరాజు, గణేష్,పెంటయ్య, సతీష్, కాంగ్రెస్ నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.

దీక్ష చేపడుతున్న దళిత సంఘాల నేతలు

పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం చేయకండి

కోటవురట్లలో పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి- కోటవురట్ల: పరిశుద్య పనుల పట్ల నిర్లక్ష్యం చేయరాదని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. గురువారం జల్లూరు గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రంగా ఉంచాలని సచివాలయ, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి కూర్మారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలో గొడిచెర్ల గ్రామంలో గురువారం ఎంపీడీవో డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు పర్యటించారు. ముందుగా గ్రామంలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. వర్మీ కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించారు. గ్రామంలో ఇంటింటా తడి పొడి చెత్త సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. అనంతరం బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ, పంచాయతీ కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో పరిశీలిస్తున్న అధికారులు

రావికమతం:మండలంలోని కవగుంట గ్రామంలో గురువారం శానిటేషన్ పనులను సర్పంచ్ దాసరి సూర్య కుమారి, కార్యదర్శి రాజబాబు ఆధ్వర్యంలో ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాసరి సూర్యకుమారి మాట్లాడుతూ,గ్రామ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు 15 ఫైనాన్స్ నిధులతో పాటు,రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా ప్రత్యేక నిధులను కేటాయించాలని కోరారు.

పాయకరావుపేటలో సన్మానిస్తున్న ఉద్యోగులు

సచివాలయ సిబ్బందికి ఘన సత్కారం

ప్రజాశక్తి -పాయకరావుపేట:మండలంలోని పాల్మెన్ పేట పంచాయతీకి చెందిన పలువురు సచివాలయ సిబ్బంది బదిలీపై వెళుతుండటంతో గురువారం సర్పంచ్ కోడా కోటేశ్వరరావు, ఎంపిటిసి గోసల మహంకాలమ్మ, తెలుగుదేశం పార్టీ నాయకులు మైలపల్లి అశోక చక్రవర్తి, చౌక్కా వేణుగోపాల కృష్ణ , పంచాయతీ కార్యదర్శి పి రామగోవిందు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ, వెలుగు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

చీడికాడ:మండలంలోని, జైతవరం గ్రామంలో ఇటీవల బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగస్తులను, పంచాయతీ కార్యదర్శి పట్నాల గోపిని గ్రామ సర్పంచ్ కోడూరు సత్యవతి, ఎంపీటీసీ పైలా ముత్యాలు నాయుడు, ఉప సర్పంచ్ ఈర్లీ చైతన్య, పంచాయతీ కార్యదర్శి, సిహెచ్ వెంకటేష్ ఘనంగా సత్కరించారు. పారిశుద్ధ కార్మికులను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వెలుగు, ఆశ ,అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

చీడికాడలో సన్మానిస్తున్న ఉద్యోగులు

'అయ్యంకి'కి ఘన నివాళి

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు శాఖ గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా అయ్యంకి చిత్ర పటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా గ్రంథాలయ అధికారి జనార్ధన్ మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి అయ్యంకి ఎనలేని కృషి చేశారన్నారు. అయ్యంకి చేసిన పోరాటాలతోనే గ్రంథాలయాలు స్థాపించబడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రమణమ్మ, పాఠకులు పాల్గోన్నారు.

నర్సీపట్నంటౌన్:శాఖా గ్రంధాలయంలో గ్రంథాలయోధ్యమకారుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని గ్రంథాలయధికారిణి పి. దమయంతి ఘనంగా నిర్వహించారు. పాఠకులు రవి, నారాయణ అయ్యంకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులుర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

ములగాడ : గ్రంథాలయోద్యమానికి పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని సుంకర చలపతిరావు అన్నారు. గురువారం మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో అయ్యంకి జయంతి సందర్భంగా ఆయనకు ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర గ్రంథాలయోద్యమ పితామహునిగా గ్రంథాలయాల వ్యాప్తికి అయ్యంకి ఎంతో కృషి చేశారన్నారు. పౌర హక్కులసంఘం జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ, దేవాలయాల కంటే గ్రంథాలయాలు ముఖ్యమని అయ్యంకి భావించారని, వాటి ఏర్పాటుచేసి జ్ఞాన దీపాన్ని వెలిగించారన్నారు. ఎన్‌సిసి జిల్లానోడల్ అధికారి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్‌సిసి వాలంటీర్లకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ వి. అజయ్‌కుమార్, చిత్రకారులుడి. శ్రీనివాస్‌మనోహర్ పాల్గొన్నారు.

నక్కపల్లిలో నివాళి అర్పిస్తున్న గ్రంథాలయాధికారి

సబ్బవరం : గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య సేవలు చిరస్మరణీయమని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి వి.శిరీష తెలిపారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిఈ స్కూల్ ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరి, భవిత కేంద్రం టీచర్ రాణి, అంగన్వాడి టీచర్ చిన్నతల్లి పాల్గొన్నారు.

నర్సీపట్నంలో నివాళి అర్పిస్తున్న పాఠకులు

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:జర్నలిస్టులకు సకాలంలో అక్రిడేషన్లు ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇల్లులు కట్టించి ఇవ్వాలని మంత్రులను జర్నలిస్ట్ సంఘం ప్రతినిధులు కోరారు. అమరావతిలో సచివాలయంలో రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాదులకు గురువారం రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఏచూరి శివ, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కోరాడ చంద్రరావు కలిసి వినతిపత్రం అందజేశారు.

వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నేతలు

'సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం'

ప్రజాశక్తి -నక్కపల్లి: పాయకరావుపేట నియోజక వర్గంలో నాలుగు మండలాల్లో అధికారులు సమాచార హక్కు చట్టంపై నిర్లక్ష్యం చూపిస్తున్నారని, సకాలంలో సమాచారం ఇవ్వడం లేదని టీం ఫర్ ఆర్ టి ఐ విజిల్ బ్లోయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ పోలినాటి వీరబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తుదారుడు 6(1) క్రింద దరఖాస్తు చేస్తే 30 రోజుల్లో ఇవ్వవలసిన సమాచారం 60 రోజులకు కూడా ఇవ్వడం లేదన్నారు. దీనిపై నర్సీపట్నం ఆర్డిఓ దృష్టి పెట్టి, సకాలంలో సమాచారం అందించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమాచార చట్టం పై నీరు గారుస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమాచార చట్టంపై అధికారులకు అవగాహన కల్పించాలన్నారు. నెలలో ప్రతి మూడవ శుక్రవారం ఆర్టిఐ డేను నిర్వహించాలన్నారు.

పూజలు చేస్తున్న గ్రామస్తులు

పాండవుల పండగ

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో సీతంపాలెం గ్రామంలో గురువారం పాండవుల పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఏటా ఖరీఫ్ సీజన్ సమయంలో వర్షాలు కురవాలని కోరుతూ పాండవుల పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం సాయంత్రం మహిళలు గ్రామంలో వున్న ఆంజనేయస్వామి, దుర్గాదేవి అమ్మవార్లకు ముందుగా జలాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారి ఆలయానికి ఆనుకుని వున్న పాండవుల విగ్రహాలకు కూడా జలాభిషేకం చేసి, పసుపు, కుంకుమలు, నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నాగ అప్పలరాజు, గొర్ల గోవింద్, ప్రసాదుల సత్యనారాయణ, ప్రసాదుల సింహాద్రి, బొట్టా నూకరాజు, శ్రీను పాల్గొన్నారు.

అల్పాహారం వడ్డిస్తున్న సత్యారావు

వృద్ధులకు అల్పాహారం పంపిణీ

ప్రజాశక్తి -చీడికాడ:మండలంలోని అప్పలరాజు పురం లలితా దేవి వృద్ధాశ్రమంలో గురువారం వి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సత్యారావు ఆధ్వర్యంలో వృద్ధులకు ఉదయం అల్పాహారం పంపిణీ చేశారు. వైజాగ్ నుంచి వచ్చిన బ్రహ్మర్షి పిరమిడ్ సుభాష్ పత్రీజీ స్మృతి స్మరణోత్సవం సందర్భంగా ఆశ్రమంలో పత్రీజీ టీం వృద్ధులకు ధ్యానం, శ్వాసపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్ జి ఎస్ ఎన్ మూర్తి, విఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ వి.సత్యారావు, టీం సభ్యులు పాల్గొన్నారు.

విపత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

-జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి - సీతమ్మధార : విపత్తుల పట్ల నగర ప్రజలు జాగ్రత్తలు వహించాలని, విపత్తులకు ధీటుగా పౌరులు సిద్ధంగా ఉండాలని జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మూడో జోన్ పరిధిలోని ద్వారకానగర్‌లో జివిఎంసి, విపత్తు నిర్వహణ ఆర్థిక నిధులతో సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా నిర్వహించిన సివిల్ డిఫెన్స్ వాలంటీర్స్ బేసిక్ ట్రైనింగ్ ప్రోగ్రాంనకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తరుచుగా ఏదో విధమైన విపత్తులు జరుగుతున్నాయని వాటిని ధీటుగా ప్రతిస్పందించి ఎదుర్కొనేందుకు పౌరులు సిద్ధంగా ఉండే విధంగా ఈ సివిల్ డిఫెన్స్ వాలంటీర్స్ బేసిక్ ట్రైనింగ్ ప్రోగ్రాం శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ శిక్షణా శిబిరం ద్వారా 70 మంది వాలంటీర్లకు 20 రోజులు పాటు సెర్చ్, రెస్క్యూ ఆపరేషన్లు, ప్రథమ చికిత్స, అగ్నిమాపక చర్య, వార్డెన్ సర్వీసెస్ కమ్యూనికేషన్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. అత్యవసర సమయాలలో స్పందించి ప్రజలను సురక్షితంగా కాపాడడంతోపాటు ప్రభుత్వ అధికారులకు కావలసిన విధంగా సహకారాన్ని అందించడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన యువత, నేవీ సిబ్బంది ఈ శిబిరంలో శిక్షణ పొందారన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ సివిల్ డిఫెన్స్ కంట్రోలర్ మధుసూదన్ రావు, రిటైర్డ్ డిఎంఅండ్‌హెచ్ఒ రామారావు, ఎడిఎఫ్ఒ వరప్రసాద్, పోలీస్, జివిఎంసి శాఖల అధికారులు పాల్గొన్నారు.

శిక్షణార్థులతో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

రికార్డులు పరిశీలిస్తున్న డిసిహెచ్ శ్రీనివాసరావు

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

-డిసిహెచ్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి -నక్కపల్లి: ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డిసిహెచ్ డాక్టర్ ఎస్ శ్రీనివాసరావు సూచించారు. నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిని గురువారం ఆయన తనిఖీ చేశారు. రోగుల వార్డులు, ఓపి, డెలివరీ కేసులు, శానిటేషన్, ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. రోజుకు ఎంత మంది రోగులు ఆసుపత్రికి వస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయని, వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే రోగులను సకాలంలో పరీక్షించి వైద్యం అందజేయాలని డాక్టర్లకు సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శిరీష, జమీమా, ఇషాక్, జయలక్ష్మి, హెడ్ నర్స్ వరలక్ష్మి, ఫార్మసిస్ట్ హిమామ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న తహశీల్దార్

దేవస్థానం భూమి పరిశీలన

ప్రజాశక్తి -పాయకరావుపేట: మండలంలోని శ్రీరాం పురం సర్వే నెంబరు 75-2లో సుమారు 14 ఎకరముల దేవస్థానం భూమిలోని 25 సెంట్లు అక్రమంగా అక్రమించుకొనేందుకు ప్రయతిస్తున్నారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో గురువారం తహశీల్దారు ఎస్‌వి మహేశ్వరరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ టి.త్రినాధ్, విఆర్వో శ్రీనివాసరావు ఈ భూమిని పరిశీలించారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న సిబ్బంది

అన్నదాత సుఖీభవపై

తలలు పట్టుకుంటున్న అధికారులు

- వివిధ కారణాలతో 1,479 మంది అనర్హులు

ప్రజాశక్తి-కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకంపై అర్హులందరూ లబ్ధి పొందే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ఆదేశాల్లో భాగంగా గడిచిన రెండు రోజులుగా తహసిల్దార్ తిరుమల బాబు, మండల వ్యవసాయ శాఖ సరోజిని సిబ్బంది తీవ్ర కుస్తీ పడుతున్నారు. మండల వ్యాప్తంగా 15,022 మంది అర్హులు కాగా వివిధ కారణాలతో 1,479 అనర్హులుగా డేటా లో చూపించడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రీ సర్వే లోపాలు సహా వ్యక్తిగత ఆధార్ తప్పులు, చిరునామా తప్పుల కారణంగా అధికారులు సరి చేస్తున్నారు. రికార్డుల ప్రకారం అర్హులందరికీ ప్రభుత్వం ప్రకటించిన పథకాలు అందే విధంగా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

విశాఖ రైల్వే స్టేషన్‌లో డిఆర్‌ఎం తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్ర గురువారం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. పే అండ్ యూజ్ టాయిలెట్లు, పార్కింగ్, వెయిటింగ్ హాల్స్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, లిఫ్టులు, క్యాటరింగ్ స్టాల్స్, ప్లాట్‌ఫారాలు, పార్శిల్ ఆఫీస్‌లోని సౌకర్యాలను పరిశీలించారు. సీనియర్ అధికారులతో స్టేషన్‌లో జరుగుతున్న మౌలిక సదుపాయాల పనులను సమీక్షించారు.

విశాఖ నుంచి బినాన్స్ బ్లాక్ చైన్ యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ : ప్రపంచంలోని ప్రముఖ బ్లాక్‌చెయిన్ పర్యావరణ వ్యవస్థ, వర్చువల్ డిజిటల్ ఆస్తి మార్పిడి సంస్థ యొక్క బినాన్స్, బ్లాక్ చెయిన్ యాత్ర 2025ను బుధవారం విశాఖపట్నం నుండి ప్రారంభించింది. ఈ సందర్భంగా రికార్డెంట్ సహ వ్యవస్థాపకుడు మరియు సిఇఒ విన్నీ పాట్రో మాట్లాడుతూ ఈ బ్లాక్‌చెయిన్ యాత్ర ద్వారా పర్యావరణ వ్యవస్థ పై అవగాహన, విద్య, అందిచడంతో పాటు ఈ రంగంలో విజయంసాధించడానికి అవసరమైన కీలక నైపుణ్యాలు, కమ్యూనిటీ ఆధారిత వృద్ధి ప్రాముఖ్యత, వ్యవస్థాపకులు సమ్మిళిత, స్థిరమైన పర్యావరణ వ్యవస్థలను ఎలా పెంపొందించుకోవచ్చో వక్తలు చర్చిస్తామని ప్రస్తుతం బ్లాక్చెయిన్ నుండి ఏఐ, వికేంద్రీకత మౌలిక సదుపాయాల వరకు, ఆవిష్కరణ వేగం వేగవంతమవుతోందన్నారు. డెవలపర్లు, వ్యవస్థాపకులకు మాత్రమే కాకుండా, మనం ఎలా జీవిస్తున్నాం, పని చేస్తామని, అంశాల ద్వారా భవిష్యత్తును రూపొందించాలని చూస్తున్న ఎవరికైనా తాము ప్రోత్సహాన్ని అందిస్తామన్నారు.

పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

బోరు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని జోగుంపేట ఎస్సీ కాలనీ శ్మశానవాటికలో గురువారం బోరు నిర్మాణ పనులను సర్పంచ్ జువ్వల లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జెడ్పిటీసీ నిధులతో ఈ పనులను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జువ్వల దేముడు, మాజీ జెడ్పీటీసీ చిట్ల చలపతిరావు, గొలుగొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు, వైసీపీ నాయకులు కుత్సం లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు బుంగా మాణిక్యం, ఏనుకూరి బాబ్జి, జువ్వల నారాయణ పాల్గొన్నారు.

28 నుంచి అటవీ ఉద్యోగాలకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 28 నుంచి అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అటవీ శాఖ ఉద్యోగాల కోసం శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ బి.గంగారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు డాబాగార్డెన్స్‌లోని శిక్షణా కేంద్రంలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. 9315015015 నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు పొందవచ్చునని తెలిపారు.

పెంచిన విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలి

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు ఉపసంహరించు కోవాలని, అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కంచరపాలెంమెట్టు వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్‌ఛార్జీలు పెంచి ప్రజలు నడ్డి విరుస్తోందని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయడానికి వస్తే ప్రజల వాటిని పగలగొట్టాలని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. మరి ఇప్పుడు కూటమి ప్రభుత్వం వీటిని అమలు చేస్తోందని, దీనికి చంద్రబాబు, లోకేష్ ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. సిపిఐ జిల్లాకార్యవర్గ సభ్యులు నెయ్యల నాగభూషణరావు, సిపిఐ కంచరపాలెంశాఖ కార్యదర్శి వాసుపల్లి మల్లయ్య, ప్రజానాట్యమండలి నాయకులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: వేములపూడి జిల్లా పరిషత్ స్కూల్‌లో విద్యార్థులకు బాల్య వివాహాలు అనర్థాలు, శక్తి యాప్ ద్వారా ప్రయోజనాలపై డి.ఎస్.పి పోతిరెడ్డి శ్రీనివాసరావు, రూరల్ సీఐ రేవతమ్మ, రూరల్ ఎస్ఐ రాజారావు అవగాహన కల్పించారు. గుడ్, బ్యాడ్ టచ్, గంజాయితో జీవితాలు ఛిద్రంపై వివరించారు.

బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటుపై

ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి

ప్రజాశక్తి-యస్.రాయవరం: నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆగష్టు 6న జరప తలపెట్టిన బల్క్ డ్రగ్స్ పార్క్ ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండలంలో గుర్రాజు పేట గ్రామంలో గురువారం స్థానిక విలేఖర్లతో నాయకులు, రైతులు మాట్లాడుతూ, గుడివాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 206-2లో 172 ఎకరాల బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు భూముల సేకరణకు ఇటీవల ప్రత్యేక భూ అధికారి, ఎస్.రాయవరం తహశీల్దార్ గుర్రాజుపేట గ్రామ సచివాలయం గ్రామ సభ నిర్వహించిన సందర్భంగా రైతులందరూ ముక్తకంఠంతో భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారన్నారు. అయినా ప్రభుత్వం రైతుల అభిప్రాయాన్ని, మనోభావాలను దృష్టిలో పెట్టుకోకుండా రైతుల ఆమోదం, అంగీకారం లేకుండా ఈ భూములను కూడా సేకరించి బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు చేస్తామని చెప్పడం సరికాదన్నారు. సామాజిక, పర్యావరణ ప్రభావిత నివేదిక తయారు చేసి దాంట్లో ఈ సర్వే నెంబరు ను ప్రభుత్వం ఏకపక్షంగా పొంది పర్చడం జరిగిందని, దీని రైతులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారన్నారు. వెంటనే ఆ సర్వే నెంబరు తొలగించాలని డిమాండ్ చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు భూములు ఇచ్చేది లేదని, అభివృద్ధి పేరుతో ఈ ప్రాంతాన్ని విదేశాల్లో నిషేధించిన బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు చేసి ఈ ప్రాంతాన్ని డంపింగ్ యార్డ్ గా మార్చవద్దని తెలిపారు. వ్యవసాయం, కొబ్బరి తోటలతో జీవనోపాధి పొందు తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, కె.వెంకట పతిరాజు, డి.శ్రీరామరాజు, డి.ఉమాదేవి, కె.కృష్ణంరాజు, సిహెచ్ శివరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు